




• కోటప్పకొండలో తాగునీటి చెరువు

జై చెన్నకేశవ

• వైభవోపేతంగా చెన్నుని రథోత్సవం
• భక్తులతో కిక్కిరిసిన పాతూరు





స్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

మాచర్లరూరల్, ఏప్రిల్ 28: జై చెన్నకేశవ.. జైజై చెన్నకేశవ.. అంటూ భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. భక్తజనంతో మాచర్ల వీధులు కిక్కిరిసిపోయాయి. మాచర్ల పాతూరులో కొలువుతీరి ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ లక్ష్మీ చెన్నకేశవస్వామి రథోత్సవం ఆదివారం అత్యంత వైభవోపేతంగా జరిగింది. పల్నాటి ప్రజల ఆరాధ్యదైవం చెన్నకేశవుడు రథోత్సవాన్ని వేలాది మంది ప్రజలు ప్రత్యక్షంగా తిలకించేందుకు బారులు తీరారు. అడుగడుగు దండాల వాడా గోవిందా.. గోవిందా అంటూ భక్తి పారవశ్యంలో మునిగారు. పూల వర్షం కురిపిస్తూ రథాన్ని ముందుకు లాగారు. పల్నాడు నుంచే కాక తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు పోటెత్తారు. ఆలయ ప్రాంగణ సమీపంలోని రథశాల నుంచి పాత బజారు వీధుల్లో ఊరేగింపు జరిగింది. తొలుత రథ నిర్మాత వంశీకులైన కంచనపల్లి వారసులు కలశపూజ నిర్వహించడంతో రథోత్సవం ప్రారంభమైంది. రథాంగహోమం, రథబలి, రథకుంభం వంటి సాంప్రదాయ పూజాదికాలు, పండితుల వేద మంత్రాల నడుమ స్వామి వార్ల ఉత్సవ మూర్తులను సాయంసందెన రథంపైకి చేర్చా రు. శోభాయమానంగా అలంకరించిన శ్రీదేవి, భూదేవి, చెన్నుని ఉత్సవ మూర్తులను చూసిం దే తడువ జై చెన్నకేశవ, జైజై చెన్నకేశవ అంటూ భక్తుల శరణుఘోష మిన్నంటింది. అదే ఊపుతో స్వామి అధిరోహించిన భారీ రథాన్ని భక్తులు అవలీలగా లాగుతూ ముందుకు కదిలారు. కుల, మత, ప్రాంతీయ భేదాలను మరచి భక్తులు రథోత్సవంలో పాల్గొన్నారు. సుకే వాసు రథ సారధిగా వ్యవహరించగా, ఈవో సాంబశివరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. గురజాల డీఎస్పీ పల్లపురాజు ఆధ్వర్యాన భారీ బందోబస్తు నిర్వహించారు.



నీటి కోసం రాస్తారోకో చేస్తున్న ఎస్సీ, బీసీ కాలనీల వాసులు

కుళాయి నీరు కరువే


ప్రతి ఒక్కరికి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని సీఎం జగన్ ఎంతో ఆర్భాటంగా ప్రకటించారు. గ్రామాల్లోని ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్లు ఇస్తామన్నారు. కానీ చేతల్లోకి వచ్చే సరికి దారుణంగా విఫలమయ్యారు. నిధుల కొరత వెంటాడు తోంది. పనులు నత్తనడకన సాగుతున్నాయి. బాపట్ల జిల్లాలో 2,16,548 గృహాలకు, పల్నాడు జిల్లా లో 2,89,328 గృహాలకు, గుంటూరు జిల్లాలో ఇంకా 75,993 గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. ఇలానే పనులు సాగితే నిర్ణీత కాలంలో పనులు పూర్త య్యే పరిస్థితి ఉండదు. పనులు వేగవంతం చేసి ప్రజల తాగునీటి వెతలను తీర్చేందుకు అధికారులు కృషి చేయాలి.

• ఇంటింటికి రక్షిత నీరు ఎన్నటికో
• జల్ జీవన్ మిషన్ పనులు నత్తనడక
• పల్లెల్లో తీరని తాగునీటి వెతలు
• నిధుల కొరతతో ముందుకు సాగని పనులు
• మూడు జిల్లాల్లో 10.32 లక్షల గృహాలు
• కుళాయిలు ఉన్న గృహాలు 4.51 లక్షలు
• కుళాయిల శాతం 43.66 మాత్రమే..

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఇంటింటికి రక్షిత నీరు అందించే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం జల్ జీవన్ మిషన్‌ను చేపట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరి సగం నిధులతో పనులు చేపట్టే విధంగా ప్రణాళికను రూపొందించారు. 2019లో ఈ పథకాన్ని అమల్లోకి తీసుకొచ్చాయి. తాగునీటి పథకాలను పూర్తి స్థాయిలో పునరుద్ధరించి ప్రతి గ్రామంలో నూరుశాతం కుళాయిల ద్వారా నీరు ఇవ్వాలని ఇరు ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఇందుకు రూ.1021.38 కోట్ల వ్యయం అవుతుందని వ్యయం అంచనా వేశారు. కేంద్రం తన వాటాలో సుమారు రూ.275 కోట్ల నిధుల విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాలో సుమారు రూ.105 కోట్లు నిధులు మంజూరు చేసింది. నిధులు పూర్తిస్థాయిలో విడుదల చేయకపోవడం వలనే జల్‌జీవన్ మిషన్ అమలులో జాప్యం జరుగుతోంది. నిధుల కొరత వెంటాడు తుండటంతో కాంట్రాక్టర్లు పనులు నిలివేస్తున్నారు.

జల్‌జీవన్ పథకం ద్వారా పల్లెల్లో ప్రతి వ్యక్తికి 55 లీటర్లు నీరు ఇవ్వడమే లక్ష్యం. ప్రస్తుతం ఉన్న నీటి పథకాలు ప్రతి వ్యక్తిగా 40 లీటర్లు నీరిచ్చే విధంగా రూపొందించబడ్డాయి. ప్రధానంగా ఫ్లోరైడ్ ఉన్న నీటిని సేవించడం వలన ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. బొల్లాపల్లి, నకరికల్లు మండలాలతో పాటు, గురజాల, మాచర్ల నియోజకవర్గాల్లోని అనేక గ్రామాల్లో ఫ్లోరైడ్ నీటినే ప్రజలు వినియోగిస్తున్నారు. ఈ గ్రామాలన్నింటిలో రక్షిత నీరు అందించడం కూడా జల్‌జీవన్ పథకం లక్ష్యమే. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 10,32,904 గృహాలు ఉన్నాయి. ఇప్పటివరకు 4,51,035 గృహాలకు మాత్రమే కుళాయిల ద్వారా నీటి సరఫరా జరుగుతుంది. 43.66 శాతమే గృహాలకు కుళాయిలు ఉన్నాయి. ఇంకా 5,81,869 గృహాలకు కుళాయి కనెక్షన్ ఇవ్వాల్సి ఉంది. అనేక గ్రామాల్లో రక్షిత నీటి పథకాలు సక్రమంగా పనిచేయడంలేదు. కుళాయిలు కూడా నామ మాత్రంగానే ఉన్నాయి. ఉన్న పథకాలను విస్తరించడంతో పాటు, పైపులైన్లు, నీటి నిల్వ చెరువుల అభివృద్ధి తదితర పనులు చేపట్టాలని ప్రణాళికలు రూపొందించారు. ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ ఆధ్వర్యంలో పనులు నిర్వహిస్తున్నారు. 2024 మార్చి కల్లా జల్‌జీవన్ మిషన్ కింద చేపట్టిన పనులు పూర్తి చేసి ఇంటింటికి కుళాయిల ద్వారా తాగునీరు ఇవ్వాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోయింది. పనులు ఇంకా నత్తనడక కన్నా నిదానంగా సాగుతున్నాయి. వందల సంఖ్యలో పనులకు టెండర్లు కూడా నిర్వహించక పోవడం గమనార్హం.



బాపట్ల జిల్లాలో...

బాపట్ల జిల్లాలోని గ్రామాల్లో 3,64,788 గృహాలు ఉన్నాయి. జల్‌జీవన్ మిషన్ కింద పనులు ప్రారంభించే నాటికి 72,292 గృహాలకు రక్షిత నీటి కుళాయిలు ఉన్నాయి. పథకం అమలులోకి వచ్చిన అనంతరం 75,948 గృహాలకు కొత్తగా నీటి కుళాయిలు ఇచ్చారు. ఇప్పటివరకు జిల్లాల్లో 1,48,240 గృహాలకు మాత్రమే కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. కుళాయిల శాతం 19.82 శాతం నుంచి 40.64 శాతానికి పెరిగింది. ఇంకా 2,16,548 గృహాలకు కుళాయి కనెక్షన్‌లు ఇవ్వాల్సిం ఉంది. ఈ జిల్లా కుళాయి కనెక్షన్లలో చివరి నుంచి 2వ స్థానంలో నిలిచింది. జలజీవన్ మిషన్ పథకం కింద 723 పనులు చేపట్టారు. రూ.205.22 కోట్లు వ్యయం అంచనాతో చేపట్టిన పనుల్లో 223 పనులు పూర్తయ్యాయి.

పల్నాడు జిల్లాలో..

రక్షిత నీటి పరఫరాకు సంబంధించి పల్నాడు జిల్లాలో గ్రామాల్లో 4,34,399 గృహాలు ఉన్నాయి. పథకం ప్రారంభించే నాటికి 58,166 గృహాలకు కుళాయిలు ఉన్నాయి. పథకం ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు 86,905 కుళాయిలను ఇచ్చారు. జిల్లా అంతటా 1,45,071 గృహాలకు కుళాయిలు ఉన్నాయి. 2,89,328 గృహాలకు ఇంకా కుళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. 33.40 శాతం గృహాలకు మాత్రమే కుళాయిలు ఉన్నాయి. జల్‌జీవన్ మిషన్ అమలులో పల్నాడు జిల్లా చిట్ట చివరన నిలిచింది. ఈ పథకం కింద జిల్లాలో 1055 పనులు గర్తించారు. ఇందుకు సంబంధించి రూ.508.16 కోట్లు వ్యయం అంచనా వేశారు. చేపట్టిన పనుల్లో 209 పనులు పూర్తయ్యాయి. మూడవ వంతు పనులు టెండర్ స్థాయి కూడా దాటలేదు. నిధుల విడుదలలో జాప్యం జరుగుతుండటంతో కాంట్రాక్టర్లు పనులు పూర్తి చేసేందుకు ముందుకు రావడంలేదు.

గుంటూరు జిల్లాలో...

గుంటూరు జిల్లాలోని గ్రామాల్లో 2,33,717 గృహాలు ఉన్నాయి. జల్‌జీవన్ మిషన్ కింద పనులు ప్రా రంభించే నాటికి 1,24,676 గృహాలకు రక్షిత నీటి కుళాయిలు ఉన్నాయి. పథకం అమలులోకి వచ్చిన అనంతరం 33,048 గృహాలకు కొత్తగా నీటి కుళా యిలు ఇచ్చారు. ఇప్పటివరకు జిల్లాల్లో 1,57,724 గృహాలకు మాత్రమే కుళాయి కనెక్షన్లు ఉన్నాయి. కుళాయిల శాతం 53.34 శాతం నుంచి 67.49 శాతానికి పెరిగింది. ఇంకా 75,993 గృహాలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. ఈ జిల్లా కుళాయి కనెక్షన్లలో రాష్ట్రంలో 15వ స్థానంలో నిలిచింది. జలజీవన్ మిషన్ పథకం కింద 308 పనులు చేపట్టగా 172 పనులు పూర్తయ్యాయి.



• పెద తురకపాలెంలో ఓవర్ హెడ్‌ట్యాంక్ దుస్థితి



తాగునీటి సరఫరాపై కక్ష

• రోడ్డెక్కిన ఉప్పలపాడు గ్రామస్తులు
• వారం రోజులుగా అల్లాడుతున్నామని ఆవేదన

వెల్దుర్తి, ఏప్రిల్ 28: పంచాయతీ వారు నీరివ్వరు.. సొంతంగా ప్రయత్నాలు చేసుకుంటుంటే అడ్డుకుంటున్నారు. టీడీపీ సానుభూతి పరులని కక్ష కట్టి ఏకంగా నీటి సరఫరాకు అధికారుల ద్వారా కొంతమంది అడ్డం పడిన ఘటన మండలంలోని ఉప్పలపాడులో చోటుచేసుకుంది. వారం రోజులుగా తాగునీటి సరఫరాకు అవాంతర ఏర్పడటంతో ఎస్సీ, బీసీ కాలనీల వాసులు ఆదివారం ఆందోళనకు దిగారు. బిందెలతో కాలనీ వాసులు జాతీయ రహదారిపై బైఠాయించారు. వారం రోజులుగా తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ నుంచి రావాల్సిన నీరు అందకపోవడంతో గత్యంతరం లేక ఏడాదికి ఒక్కో ఇంటికి రూ.6 వేలు చొప్పున ప్రైవేటు వ్యక్తికి చెల్లించి నీటిని వినియోగించుకుంటున్నారు. దీంతో కక్ష కట్టి ఆ నీరు కూడా అందకుండా చేసి ఇబ్బంది పాలు చేయాలని కొంతమంది దుర్మార్గానికి ఒడిగట్టారు. ఆ ప్రాంతంలో ఉన్న సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తీసేయాలని విద్యుత్ శాఖాధికారులపై ఒత్తిడి తెచ్చారు. దీంతో చేసేది లేక ఆ ప్రైవేటు వ్యక్తి సింగిల్ ఫేజ్ మోటారు కనెక్షన్ తీసేశారు. ఆయా కాలనీలకు తాగునీటి సరఫరా లేకుండా పోయింది. వారం రోజులుగా తాగునీరు అందకపోవడం, అధికారులు పట్టించుకోక పోవడంతో కాలనీల వాసులు జాతీయ రహదారిపై బిందెలతో రాస్తారోకోకు దిగారు. సమస్యను పరిష్కరించేదాకా ఆందోళన విరమించేది లేదని భీష్మించారు. మాచర్ల రూరల్ సీఐ సురేష్, వెల్దుర్తి ఎస్ఐ శ్రీహరి ఆందోళనకారులతో మాట్లాడినా వారు తగ్గలేదు.

జూలకంటి హామీతో విరమణ

ఆందోళన విషయం తెలుసుకున్న కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి వారి వద్దకు వచ్చి చర్చించారు. ప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని, కనీసం తాగునీరు కూడా ఇవ్వలేని దుస్థితిలో ఉందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యను తాను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. దీంతో కాలనీవాసులు ఆందోళన విరమించారు.



ఎస్ఐ, కాలనీల వాసులతో మాట్లాడుతున్న బ్రహ్మారెడ్డి

ప్రమాదంలో.. ప్రజల ఆస్తులు

అప్పిలేట్ అధికారిగా నచ్చినవారు..

ల్యాండ్ టైట్లింగ్ యాక్టులో అధికారమంతా అప్పిలేట్ అధికారులదే. ఆ అధికారులు ఎవరనేది స్పష్టంగా చెప్పలేదు. ఎవరినైనా నియమించవచ్చని యాక్టులో పేర్కొన్నారు. అదే జరిగితే రాజకీయ నాయకులనే ఆ స్థానంలో పెట్టుకుంటారు. తద్వారా రాజకీయ నేతల పరిధిలోకి ప్రజల ఆస్తులు వెళ్లిపోతా యి. వారు ఆడింది ఆట.. పాడింది పాటగా మారుతుంది. బాధి తులు కోర్టులకు వెళ్లాలన్నా వారు అనుమతించాల్సిందే. అంటే న్యాయ స్థానాలకు వెళ్లే అవకాశం కూడా లేనట్లే.

- పి.రాజారావు, సీనియర్ న్యాయవాది

- ఓ వ్యక్తి తన పేరుతో ఉన్న స్థలం అమ్మాలనుకున్నాడు. దాన్ని మీరు కొనాలనుకున్నారు. కొనుగోలు సమయంలో ఆ వ్యక్తి తన వద్ద స్థలం ఒరిజినల్ (అసలు) పత్రాలు లేవని, నఖలు (జిరాక్స్) పత్రాలు ఉన్నాయి.. వాటిని రిజిస్ట్రేషన్ చేయిస్తానన్నారు. అప్పుడు ఆ స్థలం మీరు కొంటారా? ఖచ్చితంగా కొనరు. ఎందుకని? ఆ స్థలం అతడిదో కాదో తెలుసుకోలేం. ఆ పత్రాల్లోని పేరు అసలో, నకిలీయో తెలుసుకోలేం. అలాంటి జిరాక్సులు ఎన్ని ఉన్నాయో.. ఎంత మంది దగ్గర ఉన్నాయో మనకు తెలియదు. అతడు ఇంతకముందే దాన్ని అమ్మేశాడో.. మనకు తెలియదు కాబట్టి. జిరాక్స్ పత్రాలతో ఉన్న స్థలాన్ని కొనం.





• ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌తో చేటు
• నకళ్లతో ఎవరైనా హక్కుదారులుగా నమోదు
• ఆస్తి మనదేనని నిరూపించుకోవాలంటే ఇక దేవుడే దిక్కు

గుంటూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం కొత్తగా అమల్లోకి తెచ్చిన డిజిటల్ రిజిస్ట్రేషన్ విధానంతో మొత్తంగా ప్రజల ఆస్తులు ప్రమాదంలో పడిపోయాయి. రిజిస్ట్రార్ కార్యాలయాల్లో 135 రకాల దస్తావేజులను పూర్తిగా డిజిటల్ రూపంలోనే ఇవ్వాలని వైసీపీ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ ఆదేశాల ప్రకారం ఇకపై రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో జరిగే లావాదేవీలకు సంబంధించి ఎలాంటి ఒరిజినల్(అసలు) పత్రాలు ఇవ్వరు. కేవలం జిరాక్సులు మాత్రమే ఇస్తారు. ప్రక్రి యలో అసలు దస్తావేజుల పాత్ర, అమ్మకం, కొనుగోలుదారుల అసలు సంతకాలు, వేలిముద్రలతోగానీ పనిలేదు. అవన్నీ 'క్రిటికల్ రివర్' అనే సంస్థ వద్ద ఉంటాయి. ప్రభుత్వం సంస్థ అయిన నేషనల్ ఇన్‌ఫర్మాటిక్ సెంటర్(ఎన్ఐసీ)ని పక్కన పెట్టి ప్రైవేటు సంస్థను రంగంలోకి దించడంతో ఈ ప్రమా దం మరింత పెరిగింది.

హక్కు దారులకు తెలియకుండానే అమ్ముకునే వీలు..

అసలు దస్తావేజులు, హక్కుదారుల సంతకాలు, వేలి ముద్రలు అన్నీ డిజిటల్ రూపంలో ప్రభుత్వం, అధికార యం త్రాంగం, ప్రైవేటు సంస్థ వద్దే ఉంటాయి. దీంతో కక్షిదారులతో సంబంధం లేకుండా వాటిని వారు ఏమైనా చేసే అవకాశం ఉంది. అసలు వ్యక్తులకు తెలియకుండా వాటిని తాకట్టు పెట్టుకోవచ్చు.. విక్రయించుకోవచ్చు. తిరిగి లబ్ధిదారు మళ్లీ రిజిస్ట్రేషన్‌కు వెళితే తప్ప తన ఆస్తులు ఏమయ్యాయో అతడికి తెలిసే అవకాశం లేదు.

జిరాక్సులతో రిజిస్ట్రేషన్ ప్రమాదం..

స్థలాన్ని అమ్మదలచిన వ్యక్తి తన దగ్గరున్న జిరాక్సు పత్రాలు చూపించి ఆ స్థలాన్ని ఉదయం పూట ఒక సబ్ రిజిస్టర్ కార్యాలయంలో స్థలాన్ని అమ్ముకున్నాడనుకుందాం. అదే వ్యక్తి, మళ్లీ అవే జిరాక్సులతో కొద్దిసేపటి తర్వాత దగ్గరలోని వేరే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి వేరొకరికి ఆ అమ్మి మళ్లీ రిజిస్టర్ చేయవచ్చు. మొదట అమ్మిన వివరాలు ఈసీలో నమోదు అవ్వాలంటే 24 గంటల సమయం గడవాలి. ఈలోపు అతడు ఎన్ని రిజిస్ట్రేషన్లైనా చేయించుకోవచ్చు. ఎంతమందికైనా అమ్ముకోవచ్చు.

ల్యాండ్ టైట్లింగ్ యాక్టుతో మరింత చేటు

ప్రభుత్వం అమల్లోకి తెస్తున్న భూ యాజమాన్య హక్కుల (ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్) చట్టంతో ఈ అక్రమాలకు మరింత అవకాశం ఉంది. ల్యాండ్ టైట్లింగ్ యాక్టులో భాగంగా చేపట్టే రీ సర్వేతో అందరి తలరాతలు ఒక్కసారిగా మారిపోయే ప్రమాదం ఉంది. ఎందుకంటే ఒక్క జిరాక్సు పుట్టించుకుంటే చాలు సదరు స్థలంపై తానూ హక్కుదారుగా నమోదు చేసుకోవచ్చు. ల్యాండ్ టైట్లింగ్ యాక్టు కింద రూపొందించే వివాదాల (డిస్ప్యూట్) రిజిస్టర్‌లో పేరు నమోదు చేయించుకోగలిగితే చాలు. ఇక ఆ స్థలం హక్కుదారుకు హక్కులన్నీ పోతాయి. హక్కుదారు తన వద్ద అసలు పత్రాలు ఉన్నా సదరు స్థలాన్ని అమ్ముకోలేడు. టైట్లింగ్ అధికారి ఆమోదిస్తే తప్ప సొంతదారు ఆ స్థలాన్ని అమ్ముకోలేని పరిస్థితి వస్తుంది. అంటే మొత్తంగా సొంతదారు అస్తి పూర్తిగా టైట్లింగ్ అధికారి పరిధిలోకి తద్వారా రాజకీయ పెద్దల పరిధిలోకి వెళ్లిపోతుంది. స్థలం తనది అని నిరూపించుకోవాల్సిన బాధ్యత సొంతదారుడి మీదే పడుతుంది. అది తనదేనని నిర్ధారించుకునే వరకూ అతడు తన సొంత స్థలం కూడా అమ్ముకోలేడు. తన సొంత స్థలం అని నిరూపించుకోవడానికి కోర్టుకు వెళ్లే అవకాశం కూడా లేదు. ఇలా త్రిశంకు స్వర్గంలో నలిగిపోయి సర్వం కోల్పోవాల్సిన భయానక స్థితి సామాన్య, మధ్య తరగతి ప్రజలకు దాపురించనుంది. సామాన్యుల ఆస్తులు దోపిడీ చేయడం కోసమే వైసీపీ ప్రభుత్వం ఈ విధానాలను ముందుకు తెస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు.

అధికార జోక్యంతో న్యాయం ఎండమావే..

భూ సమస్యలు తలెత్తినప్పుడు వాటిని పరిష్కరించే అధికారం న్యాయస్థానాలకు ఉండేది. ల్యాండ్ టైట్లింగ్ చట్టం ద్వారా దాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగిస్తున్నారు. తద్వారా రాజకీయ పలుకుబడిలోకి వెళ్లి హక్కుదారులు ఘోరంగా నష్టపోతారు. అదే జరిగితే భూ వివాదాల్లో సామాన్యులకు న్యాయం ఎండమావే. - వేమూరి శ్రీనివాసరావు, అడ్వకేటు



అక్రమ్‌కు పసుపు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న లోకేశ్

వైసీపీకి ప్రజల షాక్ ట్రీట్మెంట్ ..

- అంజుమన్ ట్రస్ట్‌బోర్డు అధ్యక్షుడితో సహా 200 మంది టీడీపీలో చేరిక
- పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన లోకేశ్

మంగళగిరి, ఏప్రిల్ 28: ఎన్నికలు దగ్గరపడేకొద్దీ నియోజకవర్గంలో వైసీపికి షాక్ మీద షాక్ కొడుతూనే వుంది. వైసీపీ నుంచి టీడీపీలో చేరేవారి సంఖ్య రోజురోజుకు పెరుగుతూ వస్తుంది. తాజాగా మంగళగిరి వైసీపీలో ముఖ్య నాయకుడు, స్థానిక అంజుమన్ ట్రస్టుబోర్డు అధ్యక్షుడు, ఇస్లామిక్ ఫ్రంట్ సారధి అయిన షేక్ అక్రమ్ తన అనుచరులు సుమారు రెండొందల మందితో కలిసి టీడీపీలో చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో టీడీపీ అభ్యర్థి నారా లోకేశ్ ఆదివారం ఉదయం వీరందరికీ పసుపు కండువాలను కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అలాగే తాడేపల్లి పట్టణ ముస్లిం నాయకులు షేక్ బుడే ఆధ్వర్యంలో షేక్ ఖాజా, షేక్ భాషా, షేక్ ముక్తియార్ సహా 22 ముస్లిం కుటుంబాలు యువనేత సమక్షంలో టీడీపీలో చేరారు.

ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ ముస్లిం మైనారిటీలకు మొదటిసారిగా కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసిన ఘనత అన్న ఎన్టీఆర్‌దేనన్నారు. తరువాత చంద్రబాబు హజ్‌హౌస్ నిర్మాణం చేసి ముస్లింల పట్ల తనకున్న మమతానురాగాలను చాటుకున్నారన్నారు. మైనారిటీవర్గాలో పేదల సంఖ్య ఎక్కువగా వుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ముస్లిం మైనారిటీల కోసం రంజాన్ తోఫా, దుల్హన్, హజ్‌యాత్రకు సబ్సిడీ, రంజాన్ సమయాల్లో మసీదులకు రంగులు వేయించడం, షాదీఖానాల నిర్మాణం, విదేశీవిద్య, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అనేక కార్యక్రమాలను చేపట్టామని వివరించారు. జగన్ అధికారంలో వచ్చాక వాటన్నింటిని రద్దుచేసి ముస్లింలకు చాల అన్యాయం చేశాడన్నారు. తాము అధికారంలోకి వచ్చాక వాటన్నింటిని తిరిగి పునరుద్ధరించడంతో పాటు ఇస్లామిక్ బ్యాంకు ఏర్పాటుచేసి పేద ముస్లింలకు సబ్సిడీలపై రుణాలను అందజేస్తామన్నారు. మైనారిటీ విద్యార్థుల కోసం కెరీర్ కౌన్సిలింగ్ సెంటర్లను ఏర్పాటు చేయిస్తామన్నారు. తాడేపల్లి ప్యాలెస్‌లో పెద్ద సైకో, మంగళగిరిలో చిన్న సైకో వున్నాడన్నారు. అధికారంలోకి వచ్చాక మైనారిటీలపై పెట్టిన తప్పుడు కేసులను ఎత్తివేయిస్తామని లోకేశ్ హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నందం అబద్దయ్య, తమ్మిశెట్టి జానకీదేవి, వల్లభనేని వెంకట్రావు, దామర్ల రాజు, గోవాడ దుర్గారావు, షేక్ రియాజ్, మహ్మద్ ఇబ్రహీం, షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.



వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారితో కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు

కేంద్ర సహకారంతో రాష్ట్రాభివృద్ధి సాధ్యం

- మాజీ మంత్రి, చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 28: ఇప్పుడున్న పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఆదివారం మంత్రి విడదల రజిని సొంత గ్రామం పురుషోత్తపట్నంలో జరిగిన కార్యక్రమంలో 100కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. పీఏసీఎస్ మాజీ చైర్మన్ తోట బ్రహ్మస్వాములు ఆధ్వర్యంలో నీటి సంఘం మాజీ చైర్మన్ విడదల సాంబయ్య, మిరియాల లక్ష్మీనారాయణ, తోట పుల్లప్ప, తోట శివయ్య తదితరులు ఉన్నారు. వీరికి ప్రత్తిపాటి పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ సొంత గూటికి వచ్చిన అందరికీ అభినందనలు తెలిపారు. బీజేపీతో పొత్తు వల్ల ఏ వర్గానికి ఇబ్బంది రాదని చంద్రబాబు ఇప్పటికే స్పష్టమైన హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. స్థానికంగా చూస్తే గత ఎన్నికల్లో పురుషోత్తపట్నంలో వైసీపీకి భారీ మెజార్టీ ఇచ్చారని, ఈసారి రివర్స్‌లో తెలుగుదేశానికి భారీ మెజార్టీ ఇవ్వబోతున్నారని ఆయన అన్నారు. రానున్న ఐదేళ్లల్లో చిలకలూరిపేటలో అభివృద్ధికి చిరునామాగా మారుస్తామని ప్రత్తిపాటి అన్నారు. కార్యక్రమంలో నియోజక వర్గ జనసేన సమన్వయ కర్త తోట రాజా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ ఆటబొమ్మ రోశయ్య

- నేనైతే రాజీనామా చేసి జగన్ మొహాన కొట్టేవాడిని
- మూడు రాజధానులు కావాలన్న రోశయ్యపై పెమ్మసాని ఫైర్



సమావేశంలో మాట్లాడుతున్న పెమ్మసాని, వేదికపై మాధవి తదితరులు

గుంటూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): 'కిలారు రోశయ్య సీఎం జగన్ ఆటబొమ్మ.. మూడు రాజధానులు కావాలని జగన్ చెప్పమంటే ఆయన చెప్పేస్తారా? ప్రజల గురించి ఆలోచించేది లేదా? అదే నేనైతే రాజీనామా చేసి జగన్ మొహాన కొట్టి వచ్చేవాడిని' అంటూ వైసీపీ గుంటూరు పార్లమెంటు అభ్యర్థి కిలారు రోశయ్యపై కూటమి ఎంపీ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ విరుచుకుపడ్డారు. గుంటూరులోని 38వ డివిజన్లో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కిలారు రోశయ్య 700 ఎకరాల్లో గ్రావెల్ తవ్వి అక్రమ సంపాదనను వెనకేసుకున్నారని అందుకే జగన్ చెప్పినట్టల్లా ఆడుతున్నారని విమర్శించారు. అక్రమ మైనింగ్ ద్వారా రూ.2,300 కోట్లు అవినీతి చేశారు కాబట్టే, జగన్ చెప్పినదానికల్లా తల ఊపుతున్నారని విమర్శించారు. అందుకే ఎంపీగా ఓడిపోతారని తెలిసినా సరే గత్యంతరం లేక రోశయ్య పోటీ చేస్తున్నారని అన్నారు. అలాగే గుంటూరు పశ్చిమ నుంచి పోటీ చేస్తున్న రజని ఒక పద్ధతి ప్రకారం అవినీతి చేస్తున్నారని, అందుకే చిలకలూరిపేట ప్రజలు వద్దనుకున్నారని చెప్పారు. అందువల్లే ఓటమి భయం కొద్దీ ఆమె గుంటూరు వచ్చి ఆమె చేరారని విమర్శించారు. రాష్ట్రంలో విద్యార్థులకు, యువతకు ఉపాధి అవకాశాలు లేక పక్క రాష్ట్రాలకు, దేశాలకు వలస పోవాల్సిన అవసరం వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక అమెరికాలో స్థిరపడ్డ ప్రవాసాంధ్రుల సహకారంతో పార్లమెంట్, రాష్ట్ర అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని ఆయన హామీ ఇచ్చారు. పరిశ్రమలను తీసుకురావాలంటే ఒక కఠోర శ్రమ అవసరమని సొంత నేలపై, పుట్టిన భూమిపై ప్రేమ ఉన్నవారికి మాత్రమే ఆ ప్రయత్నం సాధ్యమవుతుందని ఆయన వివరించారు. పశ్చిమ నియోజకవర్గ కూటమి అభ్యర్థి గల్లా మాధవి మాట్లాడుతూ ఈ అరాచక ప్రభుత్వాన్ని అరికట్టాలంటే ప్రజలందరూ ఏకతాటిపై నిలిచి కృషిచేయాలని చెప్పారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఆళ్ల హరి, స్థానిక నేతలు విశ్రాంవు, కార్పొరేటర్ పద్మ పాల్గొన్నారు.

పెమ్మసాని ఆధ్వర్యంలో 180 కుటుంబాలు చేరిక

విడుదల రజని అంత జన హృదయ నేత అయితే చిలకలూరిపేట నుంచి ఎందుకు మడమ తిప్పారు? రిటర్నింగ్ అధికారికి ఆమె సమర్పించిన అఫిడవిట్‌కు, ఆస్తులకు ఏమైనా సంబంధం ఉందా? అని పెమ్మసాని చంద్రశేఖర్ ప్రశ్నించారు. గుంటూరులోని స్థానిక 33వ డివిజన్లో ఆదివారం 100 సుమారు 180 కుటుంబాలు టీడీపీలో ఆదివారం చేరాయి. పెమ్మసాని, గల్లా మాధవి కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం పెమ్మసాని మాట్లాడుతూ ప్రశాంత్, ఖాదర్, కిరణ్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరుతున్న కార్యకర్తలకు ఆహ్వానం పలికారు. బటన్ నొక్కడడానికి సీఎంతో పనిలేదని, ఐఏఎస్, ఐపీఎస్‌లు ఉన్నా సరిపోతుందని అంటూనే ముఖ్యమంత్రి అంటే అభివృద్ధి, ప్రజా సంక్షేమం గురించి తెలిసి ఉండాలని జగన్‌కు చురకలు అంటించారు. పక్కనే పారుతున్న నది, పుష్కలమైన రిజర్వాయర్లు అందుబాటులో ఉన్నా సరే తాగడానికి నీళ్లు ఇవ్వలేని ఈవైసీపీ నాయకులు ప్రజలను ఐదేళ్లుగా కష్టాలపాలు చేశారన్నారు. ఇల్లు దాటి బయటకు రాలేని జగన్‌కు ప్రజల కష్టాలు ఎలా అర్థమవుతాయి అని ప్రశ్నించారు. మాధవి మాట్లాడుతూ ఒక్క ఛాన్స్ ఇచ్చిన పాపానికి ఆంధ్రప్రదేశ్‌ను జగన్ 20 ఏళ్ల వెనక్కి తీసుకువెళ్లారని విమర్శించారు. శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్ మాట్లాడుతూ ఏపీ రాజధానిగా అమరావతి ఉంటుందని, అసెంబ్లీ సాక్షిగా జగన్ అంగీకరించారని, సీఎం అయ్యాక ఆ మాట తప్పి ప్రజలను మోసం చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు తాళ్ల వెంకటేష్‌యాదవ్, మైనార్టీ నేతలు సయ్యద్ ముజీబ్, కార్పొరేటర్ ఈరంటి హరిబాబు(బుజ్జి), డివిజన్ నాయకులు పేరయ్య తదితరులు పాల్గొన్నారు.



పెమ్మసాని, షరీఫ్‌లకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న స్థానిక నేతలు



చీరాల గోవర్ధనరెడ్డికి కండువాకప్పి పార్టీలోకి ఆహ్వానించిన చంద్రబాబు

చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన మాజీ ఎమ్మెల్యే చీరాల

బాపట్ల, ఏప్రిల్ 28: మాజీ ఎమ్మెల్యే, వైసీపీనాయకులు చీరాల గోవర్ధనరెడ్డి ఆదివారం తెలుగుదేశం పార్టీలో చేరారు. నెల్లూరు జిల్లా కొవ్వూరు నియోజకవర్గం బుచ్చిరెడ్డిపాలెం గ్రామంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. 1964వ సంవత్సరంలో కర్లపాలెం మండలం నల్లమోతువారిపాలెం గ్రామసర్పంచ్‌గా ఎన్నికైన చీరాల గోవర్ధనరెడ్డి 1989 వరకు సర్పంచ్‌గా ఎన్నికవుతూ వచ్చారు. 1967లో కోన ప్రభాకరరావుకు మద్దతునిచ్చారు. 1983లో తెలుగుదేశంపార్టీలో చేరారు. 1985లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. 1989లో కాంగ్రెస్‌పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1994లో తెలుగుదేశం అభ్యర్థికి మద్దతు తెలిపారు. 1999లో మరోసారి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు. 2004 సంవత్సరంలో కాంగ్రెస్‌పార్టీకి మద్దతు తెలియజేసి గాదె వెంకటరెడ్డి విజయానికి కృషి చేశారు. 2009లో తెలుగుదేశంపార్టీ టిక్కెట్టు కేటాయించినప్పటికి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందారు. 2014, 2019 ఎన్నికల్లో వైసీపీలో చేరి అభ్యర్థుల విజయానికి కృషి చేశారు. ప్రస్తుతం వైసీపీ ఎమ్మెల్యే కోన రఘుపతి తనకు సముచిత స్థానం కల్పించకపోవటం, కనీసం పార్టీ కార్యక్రమాలకు కూడా పిలవకపోవటం వంటి చర్యలకు పాల్పడటంతో మనస్థాపానికి గురైనట్లు ఆయన తెలిపారు. తెలుగుదేశం అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ ఆయనను కలిసి మద్దతు తెలియజేయాలని కోరటంతో టీడీపీలో చేరాలని నిర్ణయించుకొని నెల్లూరు జిల్లా పర్యటనలో ఉన్న చంద్రబాబును కలిసి ఆపార్టీలో చేరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రశేఖర్, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు సలగల రాజశేఖర్, పార్లమెంట్ పరిశీలకులు బాచిన చెంచు గరటయ్య, కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేగేశన నరేంద్రవర్మ, సీనియర్ నాయకులు పమిడి భాస్కరరావు తదితరులు ఉన్నారు. అనంతరం తాడేపల్లిలో యువనేత, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను కలిశారు. అభ్యర్థుల విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆయన తెలిపారు.



బిల్డ్ అమరావతి అంటూ తుళ్లూరులో నినాదాలు చేస్తున్న మహిళలు రైతులు

అమరావతే ఆంధ్రుల రాజధాని

- 1594వ రోజుకు చేరుకున్న ఆందోళనలు

తుళ్ళూరు, ఏప్రిల్28: రాష్ట్ర రాజధాని కోసం 33వేల ఎకరాల భూములను ఇస్తే సీఎం జగన్‌రెడ్డి తమను రోడ్డు పాలు జేశాడని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతుల రైతు కూలీలు మహిళలు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి చేస్తున్న ఆందోళనలు, నిరసన దీక్షలు ఆదివారం నాటికి 1594వ రోజుకు చేరకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ సీఎం జగన్ అండ్ కో స్వార్థ ప్రయోజనాల కోసం విశాఖను పరిపాలన రాజధానిగా చేస్తామని చెప్పటం సిగ్గుచేటన్నారు. మూడు రాజధానులు కావాలని ఎవరూ అడగలేన్నారు. ఉన్న రాజధానిని అభివృద్ధి చేయకుండా మూడు రాజధానులని ఐదేళ్లనుంచి ప్రజలను మభ్యపెడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాజకీయ కక్షలు పక్కనపెట్టి అమరావతి అభివృద్ధిని కొనసాగించాలని హితవు పలికారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాల్లో ఆందోళనలు, దీక్షలు కొనసాగాయి.

పవర్ లిఫ్టింగ్ జిల్లా జట్టుకు 14 మంది ఎంపిక

మంగళగిరి సిటీ, ఏప్రిల్ 28: గుంటూరు జిల్లా సబ్‌జూనియర్, జూనియర్ పురుషుల, మహిళల క్లాసిక్ పవర్‌లిఫ్టింగ్ ఎంపిక పోటీలను ఆదివారం మంగళగిరిలోని ఫిట్‌జోన్ జిమ్‌లో నిర్వహించారు. ఈ పోటీలో మొత్తం 30 మంది లిఫ్టర్లు పాల్గొనగా, 14 మందిని జిల్లా జట్టుకు ఎంపిక చేసినట్లు పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయభాస్కరరావు, షేక్ సందాని తెలియజేశారు. సబ్‌జూనియర్ మహిళల విభాగంలో ఈఎల్ వినయ్‌శ్రీ, పురుషుల విభాగంలో ఆర్‌నితిన్, జూనియర్ మహిళల విభాగంలో ఎం.షానూన్, ఎన్.జ్ఞానదివ్య, జూనియర్ పురుషుల విభాగంలో పీ.చంగిస్ ఖాన్, హెచ్.రమేష్‌శర్మ, వై.హర్షవర్ధన్, ఎస్.కౌషిక్, ఆర్.లలిత్ శశాంక్, పీ.పృథ్వీకుమార్, పీ.దేవేందర్‌రెడ్డి, ఎ.రామకృష్ణ, కే.శ్రీకాంత్, బి.విజయ్‌తేజ ఎంపికయ్యారని వెల్లడించారు. వీరు మే 5న విశాఖపట్నంలో జరిగే ఏపీ పవర్ లిఫ్టింగ్ సబ్‌జూనియర్, జూనియర్ క్లాసిక్ మెన్ అండ్ ఉమెన్ పోటీల్లో జిల్లా జట్టు తరపున పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన లిఫ్టర్లను పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు ఆర్ఎస్.వంశీకృష్ణ, జీ.వెంకటేశ్వరరావు, పీ.భాస్కరరావు, బి.చంద్రిక, బి.ప్రసాద్, ఘట్టమనేని సాయిరేవతి, మస్తాన్‌వలి, జీ.శిరీష, ఆళ్ల పవన్‌కుమార్, షేక్ సుభానీ, జీ.మల్లేశ్వరరావు, పీ.సందీప్, కే.మధుబాబు తదితరులు అభినందించారు.



జిల్లా జట్టుకు ఎంపికైన లిఫ్టర్లతో అసోసియేషన్ ప్రతినిధులు

వైసీపీ కంచుకోటలో కూటమికి బ్రహ్మరథం

- అరవిందబాబు, శ్రీకృష్ణదేవరాయలు ర్యాలీకి విశేష స్పందన
- పరిసర గ్రామాల నుంచి వేలాదిగా తరలివచ్చిన ప్రజలు



శ్రీకృష్ణదేవరాయలు, అరవిందబాబులకు స్వాగతం పలుకుతున్న గ్రామస్థులు

నరసరావుపేటరూరల్, ఏప్రిల్ 28: వైసీపీ కంచుకోట నరసరావుపేట మండలం లింగంగుంట్ల గ్రామంలో నరసరావుపేట టీడీపీ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు, లావు శ్రీ కృష్ణ దేవరాయలకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దశాబ్దాలుగా టీడీపీ కనీసం ప్రచారం కూడా చేయని ప్రాంతంలో వేలాదిమందితో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నరసరావుపేట నియోజకవర్గం లింగంగుంట్ల గ్రామంలో వేలాదిగా తరలి వచ్చిన కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. పదేళ్లుగా జగన్‌రెడ్డి కోసం, వైసీపీ జెండా మోసిన కార్యకర్తలను దగా చేశాడంటూ కార్యకర్తలు ధ్వజమెత్తారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ప్రజల జీవితాలు కారు చీకట్లలో మగ్గిపోతున్నాయని డాక్టర్ చదలవాడ అరవింద బాబు ధ్వజమెత్తారు. నవరత్నాల పేరుతో నయవంచనకు పాల్పడిన జగన్‌రెడ్డిని రాష్ట్రం నుంచి, గోపిరెడ్డిని నియోజకవర్గం నుంచి తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ధరల బాదుడు, చంద్రబాబు రాష్ట్రానికి పరిశ్రమలు తెచ్చి యువతకు ఉద్యోగాలివ్వాలని తాపత్రయపడితే.. జగన్ రెడ్డి కల్తీ మద్యం, గంజాయి డ్రగ్స్ తెచ్చి యువత జీవితాలను ఛిద్రం చేశాడని మండిపడ్డారు. చంద్రబాబు అభివృద్ధి సంక్షేమంతో రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తే జగన్ రెడ్డి మాత్రం దోచుకోవడం దాచుకోవడంతో రాష్ట్రాన్ని అవస్థలపాలు చేశాడని డాక్టర్ చదలవాడ ధ్వజమెత్తారు. అరాచక ప్రభుత్వాన్ని రాష్ట్రం నుంచి తరిమికొట్టి ప్రజాస్వామ్య పాలన సాధనకోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలని డాక్టర్ చదలవాడ, లావు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి సయ్యద్ జిలాని, బీజేపీ నాయకులు రంగిశెట్టి రామకృష్ణ, టీడీపీ నాయకులు కపిలవాయి విజయ్ కుమార్, గోనుగుంట్ల కోటేశ్వరరావు, వేల్పుల సింహాద్రి యాదవ్, చిన్నపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో శ్రీకృష్ణదేవరాయలు, అరవిందబాబు



ప్రసంగిస్తున్న వల్లంరెడ్డి లక్ష్మారెడ్డి, వేదికపై అరవిందబాబు తదితరులు

అభివృద్ధి ప్రస్తావన లేని వైసీపీ మేనిఫెస్టో

- జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి

గుంటూరు(కార్పొరేషన్), ఏప్రిల్28: వైసీపీ మేనిఫెస్టోలో ప్రజల సొమ్ముతో ఓట్లు దండుకునే పథకాల కొనసాగింపుకు ప్రాధాన్యం ఇచ్చారేతప్ప ఎక్కడా రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన ప్రణాళిక ప్రస్తావనే లేదని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి విమర్శించారు. ఆదివారం గుంటూరులోని ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వైసీపీ మేనిఫెస్టోలో మద్య నిషేధం ప్రస్తావన లేకపోవడం శోచనీయమన్నారు. నీటిపారుదల ప్రాజెక్టులకు ఎలాంటి ప్రాధాన్యం ఇవ్వలేదని తెలిపారు. 14 లక్షల కోట్లకు పైగా పెరిగిన అప్పుల భారానికి పరిష్కారం చూపలేదన్నారు. విశాఖ స్టీల్, కడప స్టీల్, విశాఖ రైల్వే జోన్, ప్రత్యేక హోదాల ప్రస్తావన లేదని తెలిపారు. మూడు రాజధానులను కొనసాగిస్తామని మేనిఫెస్టోలో పేర్కొని ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టి ఓట్లుగా మార్చుకోవాలనే కుటిల ప్రయత్నంగా కనిపిస్తుందన్నారు. లోక్‌సత్తా గుంటూరు జిల్లా కార్యదర్శి డాక్టర్ నూతలపాటి అరవింద్, అఖిల భారత పంచాయతీ పరిషత్ జాతీయ అధ్యక్షులు జాస్తి వీరాంజనేయులు, రేట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఓ.నారాయణరెడ్డి పాల్గొని ప్రసంగించారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

గుంటూరు, ఏప్రిల్ 28: అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని మల్లికార్జునపేట 5లైన్‌కు చెందిన ఆవులమంద శ్రీనివాసరావు (47) అనే వ్యక్తి అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లికార్జునపేట 5వ లైనుకు చెందిన ఆవుల మంద శ్రీనివాసరావు ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తుంటాడు. సుమారు రూ.25 లక్షల వరకు అప్పుల పాలయ్యాడు. దీంతో అప్పులు తీర్చే మార్గం లేక ఆత్మహత్య తప్ప మరో మార్గం లేదని భావించి ఇంటిలోని బాత్రూంలో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య హేమార్చన ఫిర్యాదు మేరకు అరండల్ పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుంటూరు మీదగా రైళ్ల దారి మళ్లింపు

గుంటూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): కాజీపేట - విజయవాడ మధ్యన మూడో రైలు మార్గం నిర్మాణ పనుల కారణంగా పలు రైళ్లను గుంటూరు మీదగా దారి మళ్లించాలని దక్షిణ మధ్య రైల్వే నిర్ణయించింది. నెంబరు. 18519/18520 విశాఖపట్టణం - ఎల్‌టీటీ - విశాఖపట్టణం ఎక్స్‌ప్రెస్‌ని మే 9, 15, 21 తేదీల్లో గుంటూరు, నడికుడిమీదగా దారి మళ్లిస్తామని డీఆర్ఎం ఎం.రామకృష్ణ తెలిపారు. నెంబరు. 18045 షాలిమార్-హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్‌ని మే 2, 3,8, 9, 20,21 తేదీల్లో, నెంబరు. 18046 హైదరాబాద్ - షాలిమార్ రైలుని మే 3,4,9,10, 21, 22 తేదీల్లో, నెంబరు. 12774 సికింద్రాబాద్ - షాలిమార్ రైలుని మే 21 గుంటూరు మీదగా దారి మళ్లించి గమ్యస్థానాలకు చేర్చడం జరుగు తుందన్నారు. అలానే నెంబరు. 11019 సీఎస్ఎంటీ - భువనేశ్వర్, నెంబరు. 11020 భువనేశ్వర్ - సీఎస్ఎంటీ రైలుని మే 2, 3, 8, 9, 20, 21 తేదీల్లో, నెంబరు. 07225 సికింద్రాబాద్ - షాలిమార్ ప్రత్యేక రైలుని ఈ నెల 29, మే 6, 20 తేదీల్లో, నెంబరు 07226 షాలిమార్ - సికింద్రాబాద్ రైలుని ఈ నెల 30, మే 7, 21 తేదీల్లో, నెంబరు. 22849 షాలిమార్ - సికింద్రాబాద్ రైలుని మే 8న, నెంబరు. 22850 సికింద్రాబాద్ - షాలిమార్ రైలుని మే 10న గుంటూరు మీదగా నడుపుతామన్నారు.

పురుగుమందు తాగి
వివాహిత ఆత్మహత్య



జయశ్రీ (ఫైల్)

ప్రత్తిపాడు, ఏప్రిల్ 28: పురుగుమందు తాగి వివాహిత మృతి చెందిన ఘటన మండలంలోని గొట్టిపాడులో జరిగింది. తాడికొండ మండలం బండారుపల్లి గ్రామానికి చెందిన జయశ్రీ(30)కి గొట్టిపాడు చెందిన శివరామకృష్ణతో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇరువురు పిల్లలు ఉన్నారు. ఇంట్లో పిల్లలు అన్నం తినకుండా మారం చేస్తుండగా పెద్దల మధ్య ఆ విషయంలో చిన్నపాటి గొడవ జరిగింది. భర్త కూడా తల్లిదండ్రులనే సమర్థించడంతో తీవ్ర మనస్థాపానికి గురైన జయశ్రీ శనివారం అర్థరాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో పురుగుమందు తాగింది. దీనిని గమనించిన భర్త శివరామకృష్ణ వెంటనే గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మరణించింది. ఈ మేరకు తల్లి శ్రీదేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సోమేశ్వరరావు తెలిపారు.

ముస్లిం ఓట్లతో గెలిచి.. జగన్ వెన్నుపోటు

- మైనార్టీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రఫీ

గుంటూరు, ఏప్రిల్ 28(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో ముస్లిం ఓట్లతో గెలిచి తిరిగి, ముస్లింలను వెన్నుపోటు పొడిచిన ముఖ్యమంత్రి జగన్ అని ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ రఫీ ఆరోపించారు. ఆదివారం గుంటూరులో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రఫీ మాట్లాడుతూ 2019లో జరిగిన ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో జగన్ ప్రభుత్వం రావడానికి 90 శాతం ముస్లింలు వైసీపీకి ఓటు వేయడం వలన అసెంబ్లీకి 151 స్థానాలు, లోక్‌సభకు 22 స్థానాలు రావడానికి చాలా దోహద పడ్డాయన్నారు. రాష్ట్రంలో ముస్లిం ఓట్లతో గెలిచి కేంద్రంలో ఉన్న బీజేపీతో కలసి ముస్లిం వ్యతిరేక చట్టాలైన సి.ఎ.ఎ, త్రిబుల్ తలాక్ రద్దు చట్టాలకు మద్దతు ఇస్తూ ముస్లింలను జగన్ ప్రభుత్వం మోసగించిందన్నారు. 2014 ఎన్‌డీఏతో కలసి ఉన్న టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఎక్కడా కూడా ముస్లిం హక్కులకు భంగం కలిగించలేదన్న విషయాన్ని గ్రహించాలన్నారు. ముస్లిం వ్యతిరేక బిల్లులకు, చట్టాలకు చంద్రబాబు నాయుడు ఎక్కడా మద్దతు తెలపలేదన్నారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో ముస్లింలు జగన్‌కి తగిన బుద్ధి చెప్పి తెలుగుదేశం పార్టీకి అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.3.50
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	138, 147,158
చికెన్ విత్ స్కిన్	264.00
చికెన్ స్కిన్ లెస్	274.00

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు


సమావేశంలో మాట్లాడుతున్న బ్రహ్మారెడ్డి

విశ్వ బ్రాహ్మణ సంక్షేమానికి పెద్దపీట

● మాచర్ల నియోజకవర్గ కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి

మాచర్లటౌన్, ఏప్రిల్ 28: కూటమి అధికారంలోకి రాగానే విశ్వ బ్రాహ్మణ సంక్షేమానికి పెద్దపీట వేస్తామని మాచర్ల నియోజకవర్గ కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని విశ్వబ్రాహ్మణ కమిటీ హాల్లో నిర్వహించిన విశ్వబ్రాహ్మణ ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ టీడీపీ హయాంలో పట్టణంలో విశ్వబ్రాహ్మణ కాలనీ ఏర్పాటు చేశామని, కాలనీలో విద్యుత్ సమస్య పరిష్కారానికి రూ. 30 లక్షలు కేటాయించామని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక విశ్వకర్మ ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరుచేస్తామని, శ్మశాన వాటికను అభివృద్ధి చేస్తామని, కార్పెంటర్లకు ఇళ్ల స్థలాలు ఇస్తామని, నామినేటెడ్ పదవుల్లోనూ అవకాశం కల్పిసామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కొమెర దుర్గారావు, మున్నా రాంబాబు, యెనుముల కేశవరెడ్డి, విద్యాధరణి మురళి, యాగంటి మల్లికార్జునరావు, పోకూరి కాశీపతి, సంబోజు వేణు, శ్రీనివాసాచారి, రవిబాబు, కృష్ణ, లక్ష్మీనారాయణచారి, కూటమి నేతలు పాల్గొన్నారు.

చెన్నుని సేవలో బ్రహ్మారెడ్డి ..

పట్టణంలో వేంచేసియున్న లక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారి రథోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు. స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో అభిమానులు ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ కేంద్రాలను ప్రారంభించారు.


రథోత్సవంలో బ్రహ్మారెడ్డి

ఎన్నికల ప్రచారంలో బ్రహ్మారెడ్డికి బ్రహ్మరథం

రెంటచింతల, ఏప్రిల్ 28: మండలంలోని మల్లవరంలో జూలకంటి బ్రహ్మారెడ్డి ఎన్నికల ప్రచారానికి స్థానికులు బ్రహ్మరథం పట్టారు. బాణాసంచా కాల్చుతూ, గుమ్మడికాయలతో దిష్టితీసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ వైసీపీ ఎన్నికల మేనిఫెస్టో జగన్ మాయ మేనిఫెస్టోగా ఉందన్నారు. మే 13న జరగనున్న ఎన్నికల కురుక్షేత్రంలో టీడీపీ కూటమి అభ్యర్థులకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో షేక్ చిన మౌలాలి, బాలసైదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఏజెంట్లే కీలకం .. పోలింగ్ సమయంలో ఏజెంట్లు కీలకంగా వ్యవహరించాలని బ్రహ్మారెడ్డి తనయుడు గౌతమ్‌రెడ్డి అన్నారు. ఆదివారం రెంటచింతలలోని టీడీపీ కార్యాలయంలో బూత్ ఏజెంట్లుతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బోగస్ ఓట్లు పడకుండా చూడాలని, నిశితంగా పరిశీలించాలని, ఈ విషయంలో ఏజెంట్లు కీలకపాత్ర పోషించాలని నొక్కి చెప్పారు. సమావేశంలో సుమంత్‌రెడ్డి, శౌరైడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోనే మహిళలకు రక్షణ : శోభారాణి

కారంపూడి / దుర్గి : టీడీపీ హయాంలోనే మహిళలకు రక్షణ అని కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి సతీమణి శోభారాణి అన్నారు. మండల కేంద్రమైన కారంపూడి, మండల కేంద్రమైన దుర్గిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి అభ్యర్థులు లావు శ్రీకృష్ణ దేవరాయలు, బ్రహ్మారెడ్డిలను గెలిపించాలని కోరారు. అలాగే ఆమె తనయుడు నాగార్జునరెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.


గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

విజ్ఞతతో ఆలోచించి ఓటు వేయండి

● టీడీపీ పార్లమెంటు ఎన్నికల కో-ఆర్డినేటర్ జంగా కృష్ణమూర్తి

రాజుపాలెం, ఏప్రిల్ 28: ఓటు వేసే ముందు విజ్ఞతతో ఒక్కసారి ఆలోచన చేయండని, మీ అభ్యర్థులలో గుణగణాలను, మంచి చేయగల సామర్థ్యాలను బేరీజువేసుకొని ఓటు వేయండని ఎమ్మెల్సీ, టీడీపీ పార్లమెంటు ఎన్నికల కో-ఆర్డినేటర్ జంగా కృష్ణమూర్తి ప్రజలకు సూచించారు. ఆదివారం మండలంలోని నెమలిపురి, అనుపాలెం, కొత్తబోధనం, చౌటపాపాయపాలెం, రాజుపాలెం, బ్రహ్మణపల్లి, మొక్కపాడు, రెడ్డిగూడెం, ఆకులగణపవరం, బలిజేపల్లి, కొత్తూరు, ఉప్పలపాడు, ఇనిమెట్ల గ్రామాలో ఆయన పర్యటించారు. జంగా మాట్లాడుతూ బీసీలకు టీడీపీలోనే అధిక పాధాన్యముందన్నారు. వైసీపీలో పదవులు ఇస్తారేగానీ, నిధులు ఇవ్వరని, ప్రోటోకాల్ పాటించరని అన్నారు. రానున్న ఎన్నికల్లో ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీలందరూ ఎమ్మెల్యే అభ్యర్థి కన్నా లక్ష్మీ నారాయణ, ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు పల్లపాటి పెద్దిరాజు, జనసేన పార్టీ మండల అధ్యక్షులు తోట నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి రాష్ట్రాన్ని కాపాడుకుందాం

● పెదకూరపాడు కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్

బెల్లంకొండ, ఏప్రిల్ 28 : వైసీపీ నుంచి ఆంధ్ర రాష్ట్రాన్ని కాపాడు కుందామని పెదకూరపాడు ఉమ్మడి అభ్యర్థి భాష్యం ప్రవీణ్ అన్నారు. బెల్లంకొండ మండలం వెంకటాయపాలెం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ, వైసీపీ సీనియర్ నాయకుడు మేళం భాస్కరరావు, మరో 30 మంది ఆదివారం భాష్యం ప్రవీణ్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ తనను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసే బాధ్యత తాను తీసుకుంటానన్నారు.

మండలంలోని చంద్రాజుపాలెం గ్రామంలో భాష్యం లావణ్య ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కూటమినేతలు పలువురు పాల్గొన్నారు.

కూటమితోనే మహిళా సాధికారిత

నకరికల్లు, ఏప్రిల్ 28: మహిళా సాధికారిత కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగోతు శౌరయ్య అన్నారు. ఆదివారం రాత్రి నకరికల్లులోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు తాత జయప్రకాష్ నారాయణ అధ్యక్షతన తెలుగు మహిళలతో సమావేశం నిర్వహించారు. శౌరయ్య మాట్లాడుతూ.. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే మహిళా సంక్షేమం సాధ్యమవుతుందన్నారు. టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి మన్నవ శారదాదేవి మాట్లాడుతూ మహిళల ఆర్థికాభివృద్ధికి టీడీపీ ఎన్నో అవకాశాలను కల్పించిందన్నారు. కార్యక్రమంలో జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు దాసరి ఉదయశ్రీ, గద్దె అనంతలక్ష్మి, గొౖరెపాటి సుశీల, దూదేకుల హుస్సేన్, రాజేశ్వరి, మాజీ ఎంపీపీ కోటేశ్వరరావు, తిరుమలశెట్టి వెంకటరావు, ఢీకొండ మహానంది, పలువురు టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

బోర్లు పంచాయతీవి.. పెత్తనం వైసీపీ నేతలది

దాచేపల్లి, ఏప్రిల్ 28: సుమారు రూ.4 లక్షల వ్యక్తిగత నిధులతో బోర్లు వేశాం.. విద్యుత్ మోటార్లు బిగించాం.. మీ అందరికి మంచినీరు అందిస్తున్నందుకు.. రానున్న ఎన్నికల్లో వైసీపీకి ఓటెయ్యాలి అంటూ వైసీపీ నేతలు హల్‌చల్ చేయడంతో దాచేపల్లిలో టీడీపీ నేతలు అడ్డుకున్నారు. ఆదివారం రాత్రి 8 గంటల సమయంలో దాచేపల్లిలోని బీసీ కాలనీలో గతంలో వేసిన బోర్లకు విద్యుత్ మోటార్లను అమర్చారు. మున్సిపల్ చైర్మన్ తనయులు, ఇతర బంధువులు బోర్‌కు మోటార్లు బిగించడంలో దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ విషయంపై సమాచారం అందుకున్న టీడీపీ నేతలు బోరు బిగిస్తున్న ప్రదేశానికి వెళ్లి ఈ బోరు నగర పంచాయతీకి సంబంధించింది.. మోటారు కూడా నగర పంచాయతీ నిధులే.. ప్రజల సొమ్ముతో ఏర్పాటుచేసిన విద్యుత్ మోటార్‌పై మీ పెత్తనాలు ఏమిటి అంటూ టీడీపీ నేతలు ఎదురుదాడికి దిగారు. దీంతో ఇరువర్గాల మధ్య మాటల యుద్ధం చోటు చేసుకుంది. ఈ సందర్భంగా టీడీపీ నేతలు మాట్లాడుతూ జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని, ప్రజలను ప్రలోభపెడుతున్న విధానాన్ని నగర పంచాయతీ కమిషనర్‌కు, తహసీల్దార్‌కు, విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం ఇచ్చామని తెలిపారు. గతంలో కూడా వైసీపీ నేతలు మంచినీటి ట్యాంకర్ల విషయంలో కూడా ప్రజలను ప్రలోభపెట్టారని టీడీపీ నేతలు ఆరోపించారు.

బీసీలంటే బ్యాక్‌వర్డ్ కాదు.. బ్యాక్ బోన్

● అధికారంలోకి రాగానే 24శాతం రిజర్వేషన్, రక్షణచట్టం
● సత్తెనపల్లి కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ
● నియోజకవర్గ బీసీ నేతలతో ప్రత్యేక సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, ఏప్రిల్ 28 : బీసీలంటే బ్యాక్ వర్డ్ క్యాస్ట్ కాదని, బ్యాక్ బోన్ క్లాస్ అని సత్తెనపల్లి నియోజకవర్గ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని టీడీపీ ప్రజా వేదికలో బీసీ నాయకుల కన్నా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కన్నా మాట్లాడుతూ బీసీల జెండా, టీడీపీ ఎజెండా ఒక్క టేనని, టీడీపీ ప్రభుత్వ హయాంలోనే బీసీలకు అన్ని విధాలుగా న్యాయం జరిగిందన్నారు. మళ్లీ ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తేనే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. బీసీ నాయకులు మాట్లాడుతూ స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్‌ను వైసీపీ ప్రభుత్వం 34 శాతం నుంచి తగ్గించిందని, కూటమి అధికారంలోకి వచ్చాక 34 శాతం రిజర్వేషన్‌ను అమలు చేస్తుందన్నారు. బీసీ సబ్‌ప్లాన్ ద్వారా ఐదేళ్లలో రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేస్తామన్నారు. బీసీ రక్షన చట్టం తెస్తామన్నారు. జనాభా ప్రాతిపదికన కార్పోరేషన్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. చట్ట బద్ధంగా కులగణన చేపడతామన్నారు.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు కేశన శంకరరావు, తాత జయప్రకాష్ నారాయణ, కుమ్మరి క్రాంతికుమార్, తన్నీరు ఆంజనేయులు, కన్నా మస్తారు, బీ.శ్రీనివాస్, కల్లూరి హనుమంతరావు, కే ఏడుకొండలు తదితరులు మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి అభ్యర్థుల గెలుపుకు బీసీ సంఘాలన్నీ ఐక్యంగా పని చేస్తాయన్నారు. సత్తెనపల్లిలో కన్నా లక్ష్మీనారాయణ, ఎంపీ అభ్యర్థి శ్రీ కృష్ణ దేవరాయలను గెలిపించాలన్నారు.

సూపర్ - 6 పథకాలను ప్రజలకు వివరించాలి

మండల, పట్టణంలోని తెలుగు మహిళలు సూపర్ 6 పథకాలను గ్రామ గ్రామాన ప్రజలకు వివరించాలని కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని టీడీపీ ప్రజా వేదికలో పట్టణ, మండల టీడీపీ మహిళా సమావేశం నిర్వహించారు. కన్నా మాట్లాడుతూ టీడీపీ మినీ మేనిఫెస్టోలోని పథకాలను ప్రజలందరికీ వివరిస్తూ ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేయాలన్నారు. టీడీపీ నియోజక వర్గ పరిశీలకులు తాతా జయ ప్రకాష్ నారాయణ మాట్లాడుతూ ఎన్డీఏ కూటమి అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలను అందించి అన్నివర్గాల ప్రజలకు సంక్షేమాన్ని అందిసా మన్నారు. తెలుగు మహిళా నేతలు భీమినేని వందనాదేవి, మన్నవ శారదాదేవి, మానం విజేత, దాసరి ఉదయశ్రీ పథకాల గురించి వివ రించారు. సైకో పాలనకు చరమగీతం పాడేందుకు రానున్న ఎన్నికల్లో మహిళలంతా సైకిల్ గుర్తు పై ఓటు వేసి కన్నా, శ్రీ కృష్ణ దేవరాయలను గెలిపించాలని కోరారు. సమావేశంలో తురగా మేరీ గ్రేస్, తోట అంబిక, బందారు సంధ్య, గొౖరెపాటి సుశీల, మల్లేశ్వరి, ఆండాలు, తెలుగు మహిళా నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

4వ వార్డులో ముమ్మర ప్రచారం

పట్టణంలోని 4వ వార్డులో ఎన్డీఏ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి నేతలు, కార్యకర్తలతో కలసి ఇంటింటికి వెళ్ళి మేనిఫెస్టోలోని పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. వార్డులోని అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రజలు కన్నాకు ఘన స్వాగతం పలికారు. సైకిల్ గుర్తు పై ఓటు వేసి తనను, నరసరావుపేట ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలను గెలిపించాలని కన్నా కోరారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కటకం రామకృష్ణ, చౌట శ్రీనివాసరావు, ఆతుకూరి నాగేశ్వరరావు, బచ్చు మనోహర్, జానీ ఖాజావలి, పోట్ల ఆంజనేయులు, గుంటుపల్లి నాగేశ్వరరావు, కొమ్మిశెట్టి సాంబశివరావు, రాంబో బుడే, పెద కరిముల్లా, మస్తాన్‌వలి, పాతిమా, పాల్గొన్నారు.


పట్టణంలోని 4వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న కన్నా లక్ష్మీనారాయణ

చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలి

● అప్పుడే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, రాజధాని నిర్మాణం, హైదరాబాద్ తరహా అభివృద్ధి సాధ్యం
● పెదకూరపాడు కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్
● జంట నగరాల నియోజకవర్గ ఓటర్లతో ఆత్మీయ సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న భాష్యం ప్రవీణ్

పెదకూరపాడు, ఏప్రిల్ 28: యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రావాలన్నా, రాష్ట్రం అన్నివిధాలుగా అభివృద్ధి చెందాలన్నా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే సాధ్యమవుతుందని పెదకూరపాడు నియోజకవర్గ బీజేపీ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి భాష్యంప్రవీణ్ అన్నారు. హైదరాబాద్, మియాపూర్ సమీపంలోని ఓ కన్వెన్షన్ సెంటర్‌లో హైదరాబాద్ జంటనగరాల్లో నివాసం ఉంటున్న పెదకూరపాడు నియోజకవర్గ ఓటర్లతో ఆదివారం ఆయన ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ.. ఈ ఆత్మీయ సమావేశానికి వందలాదిగా హాజరవ్వటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. మే 13న జరిగే ఎన్నికలకు నియోజకవర్గంలో ఓటర్లయిన ప్రతి ఒక్కరూ కుటుంబ సమేతంగా వచ్చి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు, ఎంపీ అభ్యర్థిగా లావు శ్రీ కృష్ణ దేవరాయలకు సైకిల్ గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో హైదరాబాద్ లోని హైటెక్ సిటీని నిర్మిస్తే, ఇప్పుడు దానిపై ఆధారపడి ఎంతో మంది ఉపాధి పొందుతున్నారని, మనరాష్ట్రంలో చంద్రబాబు సీఎం ఐతేనే హైదరాబాద్ తరహా అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. జగన్‌పాలనలో రాష్ట్రం 30 సంవత్సరాలు వెనక్కి వెళ్ళిందని, మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడి ప్రజలను తప్పుదోవ పట్టించారన్నారు. అభివృద్ధి నిరోదక, విచ్ఛిన్నకర, విధ్వంసపూరిత వైసీపీ ప్రభుత్వాన్ని ఓడించి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.


ప్రవీణ్‌కు స్వాగతం పలుకుతున్న కూటమి శ్రేణులు

ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు సోదరి లావు రాణి రుద్రమదేవి మాట్లాడుతూ అనుభవజ్ఞులైన, మేధా సంపత్తి కలిగిన చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయాలంటే ప్రతి ఒక్కరు ఓటును సైకిల్ గుర్తు పై ఓటు వేసి ఎమ్మెల్యేగా ప్రవీణ్‌ను, ఎంపీగా శ్రీకృష్ణ దేవరాయలను గెలిపించాలని కోరారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి షేక్‌ఆరీఫ్, గుంటూరు విజేత సూపర్‌మార్కెట్ చైర్మన్ మునకొండ జగన్‌మోహనరావు, టీడీపీ ఎన్‌ఆర్ఐ ప్రధానకార్యదర్శి ఎం.కొండయ్య, టీడీపీ ప్రొఫెషనల్ వింగ్ నేత పోడపాటి తేజశ్వని, టీడీపీ నియోజకవర్గ నేతలు కృష్ణమనేని చిన్న, ఎన్‌ఆర్ఐ మాగులూరి భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ముందుగా భాష్యం ప్రవీణ్‌కు జంట నగరాల్లో నివాసం ఉంటున్న పార్టీ అభిమానులు, తెలుగు యువత నేతలు మేదరమెట్ల సౌమిత్ చౌదరి పూల బొకేతో స్వాగతం పలుకగా పూలతో పార్టీ నేతలు ఘనంగా ప్రవీణ్‌కు స్వాగతం పలికారు. పలువురికి అభివాదం చేస్తూ ఆత్మీయ సమావేశంలో పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న హైదరాబాద్‌లోని పెదకూరపాడు నియోజకవర్గ ఓటర్లు

మహిళలకు రక్షణ టీడీపీతోనే సాధ్యం

● ఎన్నికల ప్రచారంలో యరపతినేని సతీమణి

పిడుగురాళ్ల, ఏప్రిల్ 28: వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అన్నివర్గాల మహిళలు చెప్పుకోలేనన్ని బాధలు పడుతున్నారని గురజాల ఉమ్మడి అభ్యర్థి యరపతినేని సతీమణి నాగమణి తెలిపారు. శని, ఆదివారంలో పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత గంగమ్మతల్లి దేవాలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం రైల్వేస్టేషన్, షాదీఖానా ఎదురు బజారులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలతోపాటు యరపతినేని అందించనున్న గ్యాస్ సిలిండర్ పంపిణీ పథకం గురించి నాగమణి వివరించారు. కార్యక్రమంలో చల్లగుండ్ల సీత, బొల్లా పద్మ, దియ్యా విజయ తదితరులు పాల్గొన్నారు.

యరపతినేని నిఖిల్ ప్రచారం..

వైసీపీ ఐదేళ్ల పాలనతో గురజాల నియోజకవర్గ ప్రజలందరికీ విసుగొచ్చి సైకో పాలనను ఇంటికి పంపేందుకు సిద్దంగా వున్నారని యరపతినేని తనయుడు నిఖిల్ తెలిపారు. ఆదివారం రాత్రి పట్టణ పరిధిలోని 10వవార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి చంద్రబాబు మేనిఫెస్టోతో పాటు యరపతినేని సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో శాత్రుజుపల్లి శ్రీను, చల్లగుండ్ల వెంకట్రావు, అంబటి హనుమంతరావు, ఎల్‌వీఆర్, సైకిల్‌షాపు మోహన్‌రావు, కామిశెట్టి రమేష్, నెకరికంటి శివ, ఖాశిం, కుంచపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతు ఆత్మహత్య

మాచర్లటౌన్, ఏప్రిల్ 28: పురుగుమందు తాగి కౌలురైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మాచర్ల మండలం కొత్తపల్లిలో ఆదివారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పొర్లు కొండలు (55) ఐదెకరాలు కౌలుకు తీసుకొని ఐదేళ్లుగా పత్తి, మిర్చి సాగు చేశాడు. ప్రతిఏటా పంట నష్టం వస్తుండడంతో సుమారు రూ. 10 లక్షల మేర అప్పు పేరుకుపోయింది. శనివారం రాత్రి పొలానికి వెళ్తున్నా అని ఇంట్లో చెప్పి వెళ్లారు. అప్పు తీర్చే మార్గం తెలియక మనస్తాపంతో పొలంలోనే పురుగుల మందు తాగాడు. ఆదివారం వేకువజామున పొలంలో కొండలు విగతజీవిగా ఉండడాన్ని గుర్తించిన స్థానికులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతునికి భార్య మంగమ్మ, ఇరువురు కుమారులు, కుమార్తె ఉన్నారు.


నేడు కాపు సంఘీయుల సమావేశం

మాచర్లటౌన్, ఏప్రిల్ 28: పట్టణంలోని నరిశెట్టి కల్యాణ మండపంలో సోమవారం మాచర్ల నియోజకవర్గ కాపు సంఘ ఆత్మీయ సమ్మేళనం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు నియోజకవర్గ కాపు జేఏసీ గౌరవాధ్యక్షుడు పసుపులేటి బ్రహ్మనాయుడు తెలిపారు. ఈ కార్యక్రమానికి కూటమి అసెంబ్లీ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి, సత్తెనపల్లి కూటమి అసెంబ్లీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణలు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. సమావేశంలో కాపుల కార్యచరణ, భవిష్యత్ ప్రణాళికలపై సమీక్ష నిర్వహిస్తారన్నారు. కాపులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

కూటమి అభ్యర్థులను గెలిపించాలి

● శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్

అమరావతి, ఏప్రిల్28: రాష్ట్రాభివృద్ధి కోసం మైనారిటీలు కూటమి అభ్యర్థులను గెలిపించాలని శాసన మండలి మాజీ చైర్మన్ మహ్మద్ షరీఫ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన అమరావతిలో పెదకూరపాడు, అమరావతి మండలాల పరిధిలో ముస్లింల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షరీఫ్ మాట్లాడుతూ.. ఒక్కచాన్స్ అంటూ అధికారంలోకి వచ్చిన జగన్మోహనరెడ్డి రాష్ట్రాన్ని రాజధాని లేని రాష్ట్రంగా చేశారన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ముస్లింలకు అందించిన సంక్షేమ పథకాలు రద్దుచేసి అన్యాయం చేశారన్నారు. ముస్లింలను కేవలం ఓటు బ్యాంకుగా చూస్తూ వారి సంక్షేమాన్ని విస్మరించారని ఆరోపించారు. టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల పొత్తు రాష్ట్ర అభివృద్ధి కోసమేనని అన్నారు. బీజేపీ పొత్తు వలన చంద్రబాబు ప్రభుత్వంలో ముస్లిలకు జరిగే నష్టం ఏమి లేదన్నారు. బీజేపీపై ఉన్న అపోహలు తొలగించుకోవాలన్నారు. ముస్లింల సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధికి, రాజధాని నిర్మాణానికి ప్రతి ముస్లిం కూటమి అభ్యర్థులకు మద్దతు తెలపాలని, ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, ఎంపీగా లావు శ్రీకృష్ణదేవరాయలును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. భాష్యం ప్రవీణ్ సతీమణి లావణ్య మాట్లాడుతూ పేదలను ఆదుకునే మంచి మనసున్న భాష్యం ప్రవీణ్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పెదకూరపాడు, అమరావతి టీడీపీ ముస్లీం నాయకులు, మత్తపెద్దలతో పాటు అధిక సంఖ్యలో ముస్లీం కుటుంబాల వారు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శాసనమండలి మాజీ చైర్మన్ షరీఫ్


ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న యరపతినేని శ్రీనివాసరావు

గిరిజన హక్కులను కాపాడుతా

● ప్రతిగ్రామం అభివృద్ధికి రోల్‌మోడల్
● ఎన్నికల ప్రచారంలో ఉమ్మడి అభ్యర్థి యరపతినేని

దాచేపల్లి, ఏప్రిల్ 28: గిరిజనుల హక్కులను కాపాడటంతో పాటు, వారికి ఏ అవసరమొచ్చినా తానున్నాన్న విషయాన్ని మర్చిపోవద్దని గురజాల నియోజకవర్గ కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం మండలంలోని భట్రుపాలెం, కొత్తూరు, శంకరాపురం, మాదినపాడు, కాట్రపాడు, ఎస్ అగ్రహారం గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా యరపతినేని మాట్లాడుతూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధికి రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతానన్నారు. వైసీపీ పాలనలో మహిళలు, గిరిజనులని చూడకుండా వైసీపీ నేతల వేదింపులకు పాల్పడటాన్ని తానెప్పుడూ మర్చిపోనన్నారు. వైసీపీ నేతల దుర్మార్గమేమిటో దాచేపల్లి మండలంలోనే మీరందరూ చూసే వుంటారు. అక్రమ మైనింగ్‌తో వచ్చే ఆదాయం కోసం 8 మంది చిన్నారులను పొట్టన పెట్టుకోవడమే కాకుండా చేసినపనికి కూలీ డబ్బులు అడిగిన వడ్డెర యువకుడు నీలకంఠబాబును వైసీపీనేతలు పొట్టన పెట్టుకున్నారన్నారు. మద్యం, నాటుసారా అమ్ముతున్నట్లు ఒప్పుకోవాలని, మైనార్టీ యువకుడైన అలీసాను చంపేసిన విషయం మీ అందరికీ తెలిసిందేనన్నారు. దాచేపల్లి మండలంలో ఈ ఐదేళ్లలో చివరి భూములకు సాగు నీరివ్వడం చేతకాని వైసీపీ నేతలు ఊరూరా మద్యాన్ని ఏరులై పారిస్తున్నారన్నారు. ఇలాంటి దుర్మార్గాలు, దురాగతాలకు చరమగీతం పాడాలంటే రాబోయే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటువేసి ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలును, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను గెలిపించాలని కోరారు. అధికారంలోకి వచ్చాక గిరిజనులకు ఎస్టీ కార్పొరేషన్ రుణాలను అందజేయడంతో పాటు విదేశీవిద్య, స్థానికంగా ఉండే సిమెంట్ ఫ్యాక్టరీలలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను ఇప్పిస్తానని అన్నారు. ముందుగా ఆయా గ్రామాలలో యరపతినేని ఎన్నికల ప్రచారానికి అన్నివర్గాల నుండి పెద్దఎత్తున స్పందన లభించింది. మహిళలు హారతులు, గుమ్మడికాయలతో దిష్టి తీయడంతో పాటు భారీ గజమాలలతో ఘనంగా సత్కరించారు. భట్రుపాలెం లక్ష్మీనరసింహస్వామికి పట్టువస్త్రాలను యరపతినేని బహూకరించారు.

కార్యక్రమంలో పిడుగురాళ్ల జడ్పీటీసీ వెంకటకోటయ్య, రాష్ట్ర తెలుగు మహిళా ప్రధానకార్యదర్శి కర్నాటి వరలక్ష్మీ, బెల్లంకొండ భద్రి, డాక్టర్ విక్రాంత్, బాలాజీనాయక్, అంకులు, ప్రభాకరరాజు, బాబు, కొత్తూరు, శంకరాపురం, మాదినపాడు, ఎస్ అగ్రహారం గ్రామాల కూటమి నాయకులు పాల్గొన్నారు.




టీడీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించిన యరపతినేని

టీడీపీలోకి చేరికలు..

పిడుగురాళ్ల : గురజాల నియోజకవర్గంలో వైసీపీని వీడి టీడీపీలోకి చేరికపర్వం కొనసాగుతోంది. ఆదివారం పిడుగురాళ్ల టీడీపీ కార్యాలయంలో జానపాడు ఎస్సీ కాలనీకి చెందిన 20 కుటుంబాలు, మాచవరం మండలం వేమవరంకు చెందిన 15 కుటుంబాలు, గుత్తికొండ ఎస్సీ సామాజికవర్గానికి చెందిన 25 కుటుంబాలు, గురజాల పట్టణంలోని 12వ వార్డుకు చెందిన విశ్వబ్రాహ్మణ సామాజికవర్గానికి చెందిన 10 కుటుంబాలు, గోగులపాడు గ్రామానికి చెందిన ఎస్సీ బీసీ, ఓసీ మైనారిటీ సామాజికవర్గాలకు చెందిన 40 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వీరికి గురజాల నియోజకవర్గ కూటమి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు కండువాలను కప్పి ఆహ్వానించారు.

ఎమ్మార్పీఎస్ నేతలతో సమావేశం..

దాచేపల్లిలోని ఎస్సీ కాలనీలో ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తలతో యరపతినేని శ్రీనివాసరావు సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎస్సీ సామాజికవర్గం ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించడంతో పాటు దళిత విదేశీ విద్య కొనసాగిస్తామని తెలిపారు. సమావేశంలో మాతంగి సత్యానందం, దేవరకొండ సుశీల, మీసాల బాబు, కోటేశ్వరి, ఏరువ శ్రీరాములు, స్వాతి, జెడ్డా బాబు, కందుల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.


వేల్పూరులో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న, కొమ్మాలపాటి శ్రీధర్

సూపర్ సిక్స్ పథకాలను వివరించండి

● టీడీపీ పల్నాడుజిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్

అచ్చంపేట, ఏప్రిల్ 28 : సూపర్ సిక్స్ పథకాలను మరింతగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. ఆదివారం రాత్రి వేల్పూరు గ్రామంలో కొమ్మాలపాటి శ్రీధర్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో పూర్తి మెజార్టీ సాధించాలని స్థానిక నేతలకు సూచించారు. కూటమి ప్రభుత్వంలో బడుగు, బలహీన వర్గాలకు రక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, గ్రామ పార్టీ అధ్యక్షుడు నల్లపాటి చందు, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల కేంద్ర మైన అచ్చంపేటలో ఆదివారం రాత్రి తెలుగుదేశం పార్టీ నాయకులు ముమ్మర ఎన్నికల ప్రచారం చేశారు. గ్రామంలోని పెద మసీదు సెంటర్, మిల్లు, రాజీవ్ కాలనీల్లోని ప్రజలకు టీడీపీ పథకాలను వివరిస్తూ కూటమి అభ్యర్థులకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెనిగండ్ల కోటయ్య, ఎస్‌కే కాసుల, చల్లా అనూపకళ, రాయిడి సాంబశివుడు, తిరువాయిపాటి ఆంజనేయులు, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మాచర్ల పోలీసులపై చర్యలు తీసుకోవాలి

● ఎన్నికల కమిషన్‌ను కోరిన అంజయ్య


మాచర్ల, ఏప్రిల్ 28: మాచర్ల నియోజకవర్గంలో విధులు నిర్వహిస్తున్న సీఐ, ఎస్ఐలపై చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య రాష్ట్ర అదనపు ఎన్నికల అధికారి హరిశ్చంద్రప్రసాద్‌ను కోరారు. ఈ మేరకు ఆదివారం వెలగపూడి సచివాలయంలో ఫిర్యాదును అందించారు. నియోజకవర్గంలోని సీఐలు, ఐదు మండలాల ఎస్ఐలు వైసీపీ ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. కారంపూడి సీఐ చినమల్లయ్య టీడీపీ కార్యకర్తలకు సర్వీసు రివాల్వర్ చూపి బెదిరించారన్నారు. నియోజకవర్గంలో వైసీపీ నేతల కంటే పోలీసుల బెదిరింపులు ఎక్కువయ్యాయని అధికారి దృష్టికి తెచ్చారు. ఈ నేపథ్యంలో మాచర్లలో పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరారు. తన ఫిర్యాదు స్వీకరించిన హరిశ్చంద్రప్రసాద్ ఈ అంశంపై సానుకూలంగా స్పందించినట్లు పంగులూరి అంజయ్య తెలిపారు.


ఫిర్యాదు చేస్తున్న పంగులూరి అంజయ్య



ఫోన్ చేసి.. ప్రలోభాలు

- సరికొత్తగా వైసీపీ ఓట్ల వేట
- నియోజకవర్గాల్లో ప్రత్యేకంగా కాల్ సెంటర్లు
- సిబ్బందితో ఫోన్ చేసి.. రాత్రికి ఇళ్లల్లో వాలి బేరసారాలు
- అప్రమత్తంగా ఉండాలని టీడీపీ నేతలకు పార్టీ పెద్దల సూచన



వినియోగదారుల కోసం కంపెనీలు ప్రత్యేకంగా కాల్ సెంటర్లు ఏర్పాటు చేసుకుని సేవలు అందిస్తుంటాయి. ఇదే రీతిలో ప్రస్తుతం ఎన్నికల కాల్ సెంటర్లు ఏర్పాటయ్యాయి. కొన్ని నియో జకవర్గాల్లో అధికార పార్టీ అభ్యర్థులు కాల్ సెం టర్లను ఏర్పాటు చేసుకుని ఓట్ల వేటకు తెరలే పారు. ఓటర్లకు ఫోన్ చేసి ఏ పార్టీకి ఓటేస్తారు.. మాకెందుకు వేయరు.. అని వివరాలు తెలుసు కుని వారిని సంతృప్తి పరచడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసుకుంటున్నారు. తమకు ఓటు వేసేవారైతే సరే.. లేదంటే వారిని లొంగతీసుకునేందుకు ప్రలోభాల కు తెరలేపారు. పోలింగ్‌కు స మయం దగ్గర పడుతుండటంతో కా ల్ సెంటర్ల కార్యకలాపాలు ముమ్మర మయ్యాయి. ఈ కాల్ సెంటర్ల ద్వారా ఫోన్లు ఒక్క ఓటర్లకే కాదు ఆ జాబితాలో ద్వి తీయ శ్రేణి నాయకులు ఉండటం కూడా గమనార్హం. ప్రధానంగా టీడీపీ సానుభూతిపరులను ప్రసన్నం చేసుకోవ డంపైనే కాల్ సెంటర్లను ఎక్కువగా వినియోగిస్తున్నారని సమాచారం.

బాపట్ల, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో పరిస్థితిని అంచనా వేసేందుకు, ఓటర్లను లోబర్చుకునేందుకు అధికార పార్టీ అభ్యర్థులు సరికొత్త విన్యాసాలకు శ్రీకారం చుడుతున్నారు. ఏకంగా తమ సిబ్బంది చేత ఓ కాల్‌సెంటర్ ఏర్పాటు చేసి ఓటర్లకు ఫోన్లు చేయిస్తున్నారు. ఓటర్లకు ఫోన్ చేయించడం, వారి నుంచి అభిప్రాయం తీసుకోవడం, రాత్రి వేళల్లో వారి ఇళ్ల దగ్గర వాలిపోవడం.. ప్రలోభాలకు గురి చేయడం.. ఇలా వైసీపీ నేతల ఓట్ల క్రీడకు శ్రీకారం చుట్టారు. ఫోన్ ద్వారా వివరాలు రాబట్టి బేరసారాలకు దిగుతున్నారు. ఓ విధంగా ఇది ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించడమే. కానీ ఎక్కడా ఇది బయటకు రాకుండా కేవలం ఫోన్‌లో ఓటరు అభిప్రాయ సేకరణ అనే కలరింగ్ ఇచ్చి ఓట్ల కొనుగోలుకు తెరలేపుతున్నారు. దీనికి మొత్తానికి నియోజకవర్గానికి 20 మంది సిబ్బంది చేత ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేసి మరీ వైసీపీ ఓట్ల కుట్రలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి.

అభిప్రాయ సేకరణ అంటూ..

నియోజకవర్గంలోని సదరు నేత కార్యాలయం వద్ద నుంచి ఫోన్ అంటే వాస్తవ ఫీడ్ బ్యాక్ రాదనే ఉద్దేశంతో పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఫోన్ చేస్తున్నామని ఓటరును అభిప్రాయం అడిగేలా వైసీపీ నేతలు ప్రణాళికలు రచించారు. ఓటు వైసీపీకే వేస్తారుగా అని మొదలుపెట్టి కాదంటే ఎందుకు అనే కోణంలో ఆరా తీసి వారిని ప్రలోభ పరిచే ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ మొత్తం ప్రక్రియ ఆయా నియోజకవర్గాల్లోని వైసీపీ అభ్యర్థుల కనుసన్నల్లో జరగడం గమనార్హం. నిత్యం ప్రచారంలో వైసీపీ నేతల వెంబడి తిరిగే ద్వితీయశ్రేణి నేతలు కూడా ఈ ఫోన్ కాల్ వలలో చిక్కుకుని విలవిలలాడుతున్నారు. పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఫోన్ అనగానే స్థానికంగా ఉన్న పరిస్థితి.. తమ అసంతృప్తికి కారణం.. తదితరాలపై స్వేచ్ఛగా తమ అభిప్రాయాన్ని చెబుతున్నారు. ఈక్రమంలో పొద్దున లేస్తే పక్కన తిరిగే వైసీపీ ద్వితీయశ్రేణి నేతలు కూడా పార్టీకి ఈ సారి ఓటు వేయబోం అని చెబుతుండేసరికి అవాక్కవడం అభ్యర్థుల వంతవుతోంది. వారిని ప్రసన్నం చేసుకోవడానికి పెద్దఎత్తున బేరసారాల ప్రక్రియకు తెరలేపుతుండడం గమనార్హం.

నిబంధనల అతిక్రమణలివే...

ఎన్నికల వేళ రహస్యంగా ఓ 20 మందితో కాల్ సెంటర్ తరహాలో ఏర్పాట్లు చేసుకుని ఓటర్లకు ఫోన్ చేసి ప్రలోభపెట్టడం కోడ్ అతిక్రమణే. ఇక ముఖ్యంగా రాత్రి వేళల్లో కీలక నేతలే సదరు ఓటర్ల ఇంటికి వెళ్లి వారికి అవసరమైన ప్రయోజనాల విషయంలో హామీ ఇవ్వడం నిస్సందేహంగా ఎన్నికల్ కోడ్ ఉల్లంఘన కిందకే వస్తుంది. కొన్ని అంశాల విషయంలో బహిరంగంగా నిఘా ఉంటే, మరికొన్నింటిలో రహస్యంగా నేతల కదలికలపై నిఘా ఉంచాల్సిన బాధ్యత సిబ్బందిది. ఫ్లయింగ్ టీం స్క్వాడ్‌లతో పాటు ఎక్స్‌పెండీచర్ అబ్జర్వర్‌లది ఇందులో కీలకపాత్ర. కానీ వారు ఆశించిన స్థాయిలో పని చేయకపోవడంతో వైసీపీ నేతలు ఇష్టారాజ్యంగా ప్రలోభాల పర్వానికి తెరలేపుతున్నారన్న విమర్శలున్నాయి

ఓటమి భయంతోనే ఈ తరహా కుట్రలు...

ఓటమి భయంతో వైసీపీ నేతలు, అభ్యర్థులు ఈ తరహా ప్రలోభాల కుట్రలకు తెరలేపి కాల్‌సెంటర్ల ద్వారా ఓటర్లను నయానో, భయానో తమ దారికి తెచ్చుకునే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. నేరుగా ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించడాన్ని ఎవరూ తప్పుపట్టరు. అలాకాకుండా కాల్ సెంటర్ రాజకీయం ద్వారా రాత్రిళ్లు ఓటర్లను కలిసే వికృత రాజకీయానికి తెరలేపడమే అభ్యంతరకరమనే వాదనను టీడీపీ చేస్తోంది. ఇదే విషయం టీడీపీ పెద్దల దృష్టికి వెళ్లడంతో అభ్యర్థులను అప్రమత్తం చేయడంతో పాటు పాలక పార్టీ నేతల కుట్రలపై జాగరుకతతో ఉండాలని హెచ్చరించింది. వైసీపీ అభ్యర్థులు ఓట్ల వేటలో భాగంగా పాల్పడుతున్న అనైతిక కార్యక్రమాలపై అప్రమత్తంగా ఉండాలని టీడీపీ అభ్యర్థులను పార్టీ పెద్దలు హెచ్చరించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ప్రచారం ముమ్మరంగా చేసుకోవడంతో పాటు ప్రత్యర్థులు పాల్పడే కోడ్ ఉల్లంఘనలపై కూడా దృష్టి పెట్టి రుజువులతో ఈసీకి ఫిర్యాదు చేయడమో లేక సంబంధిత ఆర్వో దృష్టికి తీసుకెళ్లడమో చేయాలని సూచించింది.

ఫోన్ నెంబర్లు ఎలా చేరాయి?

నియోజకవర్గాల వారీగా గంపగుత్తగా ఓటర్ల ఫోన్ నెంబర్లు అధికార పార్టీ అభ్యర్థులకు ఎలా చేరాయి. ఓట్ల కోసం దరఖాస్తులతో పాటు ఇచ్చే ఫోన్ నెంబర్లు ఎన్నికల అధికారుల దగ్గర రహస్యంగా ఉండాలి. అలాంటి నెంబర్లు అధికార పార్టీ వ్యక్తుల వద్దకు చేరడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వ్యాపార కార్యకలాపాల కోసం ఫోన్ నెంబర్లను సేకరించడం, వినియోగదారులను విసిగించడం ఒక విధంగా నేరం. అలాంటిది కాల్ సెంటర్ పెట్టడం, ఫోన్లు చేయడంపై నేరమైనా ఎన్నికల అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారని ఓటర్లు ప్రశ్నిస్తున్నారు. నియోజకవర్గాల్లోని ఓటర్ల ఫోన్ నంబర్లు అందునా టీడీపీ సానుభూతిపరుల ఫోన్ నంబర్లు గంపగుత్తగా వైసీపీ నేతల దగ్గరకు ఎలా వెళ్లాయనే దానికి ఎన్నికల సంఘం సమాధానం ఇవ్వాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

చందా కోసమా.. పద్దులపై చర్చా?

- నేడు అత్యవసరంగా మిర్చి కమీషన్ ఏజంట్ల భేటీ
- ఇప్పటికే ఎలక్షన్ ఫండ్ కోసం వైసీపీ నేతల ఒత్తిళ్లు
- సమావేశంపై కన్నేయాలని నిఘావర్గాలకు ప్రతిపక్షాల సమాచారం

గుంటూరు, ఏప్రిల్ 28 (ఆంధ్రజ్యోతి): ది గుంటూరు చిల్లీస్ కమీషన్ ఏజెంట్స్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశాన్ని సోమవారం అత్యవసరంగా ఏర్పాటు చేస్తున్నట్లు సంఘ సభ్యులకు సమాచారం అందించారు. లాలుపురం వై జంక్షన్ సమీపంలోని ఓ కోల్డ్‌స్టోరేజ్ ప్రాంగణంలో జరిగే సమావేశానికి ఉదయం 8.30 గంటలకల్లా హాజరు కావాలని సందేశమిచ్చారు. ప్లాట్ల అమ్మకం, ఆగ్రో క్రాప్స్ పద్దులు, వడ్డీలు, ఏసీ ఎగుమతుల పద్దులు తదితరాలపై చర్చించడానికి ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు నోటీసులో పేర్కొన్నారు. అయితే అధికార వైసీపీ అభ్యర్థులకు ఎన్నికల కోసం చందాలు వసూలు చేసి ఇచ్చేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేశారని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ దఫా ఆయా సంఘాల తరఫున దాదాపుగా రూ.కోటి వరకు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఈ సమావేశంపై వీడియో, స్టాటిక్ సర్వైలెన్స్ టీంలు, ఇంటెలిజెన్స్ వర్గాలు నిఘా పెట్టాలని టీడీపీ నాయకులు కోరుతున్నారు. గుంటూరు మిర్చియార్డులో జగన్ సామాజికవర్గానికి చెందిన వ్యాపారులే ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. గత రెండు పర్యాయాల నుంచి వైసీపీ అభ్యర్థులకు అసోసియేషన్ తరఫున చందాలు వసూలు చేసి పెద్ద మొత్తంలో అందజేస్తున్నారు. ఈ దఫా యార్డు వ్యాపార కార్యకలాపాలతో సంబంధం ఉన్న ఓ నేత వైసీపీ తరఫున ఎన్నికల బరిలో ఉన్నారు. దీంతో ఎలక్షన్ ఫండ్ ఇవ్వాలని కొన్ని రోజులుగా మిర్చి వ్యాపారులపై ఒత్తిళ్లు జరుగుతున్నాయి. ఇప్పటికే ఎగుమతిదారుల సంఘాల నేతలకు వైసీపీ నేతలు ఫోన్లు చేసి ఎలక్షన్ ఫండ్ ఎంతో కొంత ఇవ్వాలని కోరారు. ఈ క్రమంలో లాలుపురం సమీపంలో జరిగే సమావేశంలో ఎన్నికల చందా వసూళ్లపై చర్చించనున్నట్లు సమాచారం. ఈ క్రమంలో సమావేశంపై దృష్టి పెట్టడంతో పాటు అసోసియేషన్లలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న వారి బ్యాంకు లావాదేవీల పైనా ఎన్నికల అధికారులు ఓ కన్నేసి ఉంచాలని టీడీపీ నాయకులు కోరుతున్నారు.

ఎన్నికల పరిశీలకుల నియామకం

- ఫిర్యాదులకు ప్రత్యేక ఫోన్ నెంబర్ల కేటాయింపు



ఎన్నికల పరిశీలకులతో జిల్లా ఎన్నికల అధికారి శివ శంకర్

నరసరావుపేట, ఏప్రిల్ 28: సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాలకు ఎన్నికల పరిశీలకులను నియమించారు. పరిశీలకులు బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలో ఎక్కడైనా ఎన్నికలకు సంబంధించిన సమస్యలను వారికి కేటాయించిన నెంబర్లకు కాల్ చేసి సమాచారం ఇస్తే వెనువెంటనే ఆ సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారు. వారు ప్రతిరోజూ ఉదయం 11 నుంచి 12 గంటల వరకు అందుబాటులో ఉంటారు.

- నరసరావుపేట లోక్‌సభ నియోజకవర్గానికి వ్యయ పరిశీలకులుగా సుమీత్‌కుమార్ నియమితులయ్యారు. ఆయన 9154690389 నంబరులో అందుబాటులో ఉంటారు.
- నరసరావుపేట, వినుకొండ, గురుజాల, మాచర్ల అసెంబ్లీలకు వ్యయ పరిశీలకులుగా జార్జ్‌జోసెఫ్‌ను నియమించారు. ఆయన 9154630396 నంబరులో అందుబాటులో ఉంటారు.
- పెదకూరపాడు, చిలకలూరిపేట, సత్తెనపల్లి అసెంబ్లీలకు వ్యయ పరిశీలకులుగా ఆర్.గౌతమ్‌ను నియమించారు. ఆయన 9154690398 నంబరులో ఫిర్యాదులు స్వీకరిస్తారు.
- పెదకూరపాడు, సత్తెనపల్లి, గురజాల, మాచర్ల నియోజకవర్గాలకు జనరల్ అబ్జర్వర్‌గా భూరే సర్వేశ్వర్‌నరేంద్రను నియమించారు. ఆయన 9154690367 నెంబర్‌లో అందుబాటులో ఉంటారు.
- చిలకలూరిపేట, నరసరావుపేట, వినుకొండ అసెంబ్లీలకు జనరల్ అబ్జర్వర్‌గా శ్రీహరి ప్రతాప్‌షాహి నియమితులయ్యారు. 91546 90375 నెంబర్‌లో అందుబాటులో ఉంటారు.
- పోలీస్ శాఖ పరిశీలకులుగా అజీత్‌సింగ్ నియమితులయ్యారు. ఆయన 96549 58832 నెంబర్‌లో అందుబాటులో ఉంటారు.

బ్యాంకు ఖాతాల్లో పింఛన్ల జమ

- లబ్ధిదారులు సచివాలయాలకు రావొద్దు
- దివ్యాంగులు, వృద్ధులకు ఇళ్ల వద్దే పంపిణీ
- కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట, ఏప్రిల్ 28: సామాజిక పింఛన్లను లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా జమ చేస్తామని కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 2,83,665 మంది లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేయడానికి ఏర్పాట్లు చేశామన్నారు. డీబీటీ ద్వారా బ్యాంకు ఖాతాకు జమ కాని వారికి మాత్రం 3న సచివాలయ సిబ్బంది ఇంటికి వచ్చి పింఛన్ అందజేస్తారన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, వీల్‌ఛైర్‌కు పరిమితమైన వారికి, సైనిక వితంతువులకు ఇంటి వద్ద పింఛన్ పంపిణీ జరుగుతుందన్నారు. లబ్ధిదారులు సచివాలయాలకు రావాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. పింఛన్ సమాచారం కోసం సచివాలయ కార్యదర్శి, వార్డు అడ్మిన్, వెల్ఫేర్ అసిస్టెంట్, డీఏలను లబ్ధిదారులు ఫోన్ ద్వారా సంప్రదించి సమాచారం పొందాలని సూచించారు.

ప్రలోభాలు.. ఐదుగురిపై కేసు

సత్తెనపల్లి, ఏప్రిల్ 28: ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నించిన ఐదుగురుపై ఎన్నికల అధికారుల ఫిర్యాదు మేరకు ఆదివారం పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని రైల్వేస్టేషన్ ప్రాంతానికి చెందిన నిజాంపట్నం అమరేంద్ర, ఉప్పు జోసెఫ్, ఈశ్వరరావు, రెడ్డి, ఏసురాజు అనే వ్యక్తులు వైసీపీ తరఫున డబ్బులు పంపిణీ చేసి ఓటర్లను ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ సూపర్‌వైజర్ రాఘవరావుకు సమాచారం అందింది. దీంతో ఆయన అమరేంద్ర ఫౌండేషన్ కార్యాలయంపై దాడి చేసి అక్కడ ఓటరు పేరుతో ఉన్న స్లిప్‌లను గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాఘవరావు ఫిర్యాదు మేరకే ఐదుగురుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పన్ను పోటు

- ఆస్తిపన్ను బాదుడుతో జనం విలవిల
- అసాధారణ రీతిలో పెరిగిన పన్నులు
- నాలుగేళ్లలో రు.4.64 కోట్ల మేరకు పెరిగిన పన్ను డిమాండ్
- పుర ప్రజలకు సేవలు మాత్రం అంతంత మాత్రమే

చిలకలూరిపేట, ఏప్రిల్ 28: చిలకలూరిపేట మున్సిపాలిటీలో ఆస్తిపన్ను బాదుడుతో జనం విలవిలలాడిపోతున్నారు. ప్రజలపై అసాధారణ రీతిలో ఆస్తిపన్ను భారం పెరిగింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆస్తిపన్ను విధానాన్ని మార్చారు. అంతకుముందు వార్షిక అద్దె ప్రాతిపదికన పన్ను మదింపు చేసి వసూలు చేసేవారు. 2021-22 నుంచి ఆ విధానాన్ని మార్చి ఆస్తివిలువ ఆధారంగా పన్ను విధింపు ప్రారంభించారు. ఇది గత నాలుగేళ్లుగా ఏటా 15 శాతం చొప్పున పెరుగుతూ వస్తోంది. వాణిజ్య సముదాయాలపై 30 శాతం మేరకు పన్నులు పెంచుతూ వస్తున్నారు. ఈ పన్నులు చెల్లించలేక ప్రజలు సతమతం అవుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 24 వేల పన్ను అసెస్మెంట్లు ఉన్నాయి. నాలుగేళ్లలో మున్సిపాలిటీ పరిధిలో ఆస్తిపన్ను డిమాండ్ రూ.4.64 కోట్ల మేరకు అదనంగా పెరిగింది. 2021-22లో రూ.8.66 కోట్ల పన్ను డిమాండ్ ఉండగా ప్రస్తుత సంవత్సరం అది రూ.13.30 కోట్లకు చేరుకుంది. అసాధారణ రీతిలో పెరుగుతున్న ఆస్తిపన్ను విషయంలో ప్రజల నుంచి తీవ్రమైన నిరసన వ్యక్తం అవుతోంది.

చిలకలూరిపేట మున్సిపాలిటీలో గత నాలుగేళ్లుగా పెరిగిన పన్నుల వివరాలు

సంవత్సరం పన్ను	డిమాండ్ (రూ.కోట్లలో)
2021-22	8.66
2022-23	10.66
2023-24	11.39
2024-25	13.30

మచ్చుకు కొన్ని ఉదాహరణలు

పట్టణంలో పండరీపురంలో చెన్నుపాటి సుధారాణి అనే గృహిణి మధ్యతరగతి కుటుంబానికి చెందినవారు. ఆమెకు 1020023998 అసెస్మెంట్ నంబర్తో ఒక గృహం ఉంది. 2021- 22 సంవత్సరంలో ఆ గృహానికి ఏడాదికి రు.4,990 పన్ను డిమాండ్ ఉండగా 2024- 25 సంవత్సరానికి అది రూ.7,514కు చేరింది. పాత పశువుల సంత ప్రాంతంలో కొత్తగా నిర్మించిన అపార్ట్‌మెంట్‌లో ఒక ప్లాటుకు గత ఏడాది రూ.5,638 పన్ను ఉండగా ఈ ఏడాది రూ.6,186 పన్ను డిమాండ్ వచ్చింది. అంటే ఏడాదిలోనే రూ.548 మేరకు పన్ను అదనంగా పెరిగింది. ఇక ఒక సంస్థకు సంబంధించిన మూడు అసెస్మెంట్‌లపై గత ఏడాది రూ.2,96,367 పన్ను పడగా ఈ ఏడాది అది ఏకంగా రూ.3,36,844కి చేరింది. అంటే ఏడాదిలో రూ.40,477 పన్ను అదనంగా పెరిగింది. అలాగే జాతీయ రహదారి పక్కన ఉన్న మరొక అసెస్మెంట్‌కు 2021- 22లో ఏడాదికి రూ.19,905 అది 2024-25 సంవత్సరానికి రూ.30,970 చేరింది. అంటే నాలుగు సంవత్సరాల్లో పన్ను రూ.10,000 మేరకు పెరిగింది. ఇక ఇదిగాక పట్టణంలోని ప్రతి ఇంటికి నెలకు రూ.60 చొప్పున చెత్త పన్ను భారం అదనంగా పెరిగింది.

నీటి సమస్య తీరేది ఎప్పుడు?

ఎన్నో సంవత్సరాలుగా చిలకలూరిపేట మున్సిపాలిటీలో రోజు మార్చి రోజు మాత్రమే నీటి సరఫరా జరుగుతోంది. రెండు మంచినీటి చెరువులు ఉన్నప్పటికీ నీటి సరఫరా పరిస్థితిలో మార్పు రాలేదు. పట్టణంలో మొత్తం 24,000 నీటి కుళాయిల ద్వారా సరఫరా జరుగుతోంది. పట్టణ శివారు కాలనీలకు ఇప్పటికీ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయవలసిన పరిస్థితి ఉంది. నీటి సమస్య శాశ్వత పరిష్కారం కోసం తెలుగుదేశం హయాంలో అమృత్ పథకం మంజూరైయింది. ఈ పథకం మంజూరు కోసం మాజీమంత్రి పత్తిపాటి పుల్లారావు ఢిల్లీ స్థాయిలో చాలా కృషి చేయవలసి వచ్చింది. ఆఖరు నిమిషంలో ఈ పథకం చిలకలూరిపేటకు మంజూరయింది. మొత్తం రు.130 కోట్లతో ఈ పథకాన్ని రూపొందించారు దీనిలో భాగంగా పట్టణంలో పైపులైన్ల నిర్మాణం, ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం చేయడంతో పాటు ప్రధానంగా నాగార్జునసాగర్ గుంటూరు బ్రాంచ్ కెనాల్ నుంచి 44 కిలోమీటర్ల పొడవున చిలకలూరిపేట మంచినీటి చెరువుల వరకు ప్రత్యేకంగా భూగర్భ పైపులైన్ నిర్మాణం చేయాలని తలపెట్టారు. తెలుగుదేశం హయాంలో సుమారు పది కిలోమీటర్ల మేరకు పైపులైన్ నిర్మాణం పని కూడా జరిగింది. మొత్తం 35 శాతం అమృత్ పథకం పనులు తెలుగుదేశం హయాంలో పూర్తయ్యాయి. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అమృత పథకం పనులు ఎక్కడివి అక్కడే నిలిచిపోయాయి. పైపులైను నిర్మాణం పనులు పడకెక్కాయి. సీఎం హోదాలో ఈ ప్రాంత పర్యటనకు వచ్చిన జగన్ ఈ పథకానికి తక్షణం రూ.63 కోట్లు మంజూరు చేస్తున్నట్లుగా లింగంగుంట్ల బహిరంగ సభలో ఏడాది క్రితం ప్రకటించారు. అయితే ఈరోజుకు ఒక్క రూపాయి కూడా విదల్చ లేదు. ఈ పైపులైన్ నిర్మాణం పని పూర్తికానందువల్ల మున్సిపాలిటీపై ఆర్థిక భారం పెరిగింది. ఏటా నాగార్జునసాగర్ మైనర్ కాల్వ నుంచి వచ్చే నీటిని మోటార్లు సహాయంతో చెరువుల్లోకి పంపు చేయవలసి వస్తోంది. ఈ ఒక్క ఏడాదిలోనే ఐదుసార్లు మోటార్ల సహాయంతో చెరువుల్లోకి మోటార్లతో నీటిని తోడవవలసి వచ్చింది. ఇందుకోసం ఈ ఏడాది సుమారు రు.2 కోట్లకు పైగా మున్సిపాలిటీ నిధులు వెచ్చించారు. మరోవైపు ఈ విషయంలో పెద్ద ఎత్తున నిధులు దుర్వినియోగం అవుతున్నాయని ప్రతిపక్షాలు గగ్గోలుపెడుతున్నాయి. మరోవైపు అమృత్ పథకంలో భాగంగా పట్టణంలో వివిధ చోట్ల ఇంటర్ కనెక్షన్లు, ఇతర పైపులైను నిర్మాణాలు మున్సిపాలిటీ చేపట్టింది. ఇందుకోసం గాంధీ పార్క్‌తో సహా మున్సిపాలిటీకి చెందిన కొన్ని ఆస్తులను రూ.60 కోట్లకు తాకట్టుపెట్టి నిధులు సమకూర్చుకున్నారు.

ఎక్కడి సమస్యలు అక్కడే..

పట్టణంలో ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ట వేసి ఉన్నాయి. ప్రధానంగా భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఇంతవరకు రూపుదిద్దుకోలేదు మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్మించ తలపెట్టినప్పటికి అది ప్రారంభ దశలోనే నిలిచిపోయింది. ఆటోనగర్ నిర్మాణం జరగలేదు. టిడ్కో గృహాల నిర్మాణం కోసం 52 ఎకరాల్లో నిర్మించిన సముదాయంలో మురుగునీటి వ్యవస్థ రూపుదిద్దుకోలేదు. మినీ స్టేడియం ఏర్పాటు కూడా కలగానే మిగిలింది. కాల్వలలోని మురుగునీరు నీరు చాలా ప్రాంతాల్లో ముందుకు కదలని పరిస్థితి నెలకొంది. మురుగు కాలువలపై ఎక్కడికక్కడ ఆక్రమణలు పెరిగాయి. ఇక పెదనందిపాడు మార్గంలో ఉన్న ప్రధాన మురుగు కాలువలో టన్నుల కొద్దీ వ్యర్థాలు ఉన్నాయి. వాటిని శుభ్రం చేసే పరిస్థితి లేకపోవడంతో ఆ కాల్వ ద్వారా మురుగునీరు ముందుకు కదలటం లేదు. ఇక ఏ వీధిలో చూసినా ఆక్రమణలు కనిపిస్తున్నాయి. పట్టణంలో ఉన్న దాదాపు అన్ని రోడ్లు పైప లైన్ల నిర్మాణం కోసం చేసిన రోడ్డు కటింగ్ గుంతలతో నిండిపోయాయి. ఆ గుంతలను బాగు చేసే పరిస్థితి కనిపించడం లేదు. ఇక ప్రతి వీధిలో చాలాచోట్ల సొంత స్పీడ్ బ్రేకర్లను ఆయా గృహాల వారు వేసుకున్నారు. జాతీయ రహదారి పక్కన ఉన్న ప్రధాన మురుగు కాలువలు ఆక్రమణలకు గురి కావడంతో వర్షం వస్తే శ్మశానం వద్ద నుంచి శివప్రియానగర్ వరకు ఉన్న ప్రాంతాలు మోకాలు లోతు నీటిలో మునిగిపోతున్న దుస్థితి నెలకొంది. పసుమర్రు రోడ్డు, గణపవరం డొంక రోడ్డు పూర్తిగా ఆక్రమణలతో నిండిపోయింది. మున్సిపాలిటీలో 300 మందికి పైగా పారిశుధ్య కార్మికులు ఉన్నారు. వారికి గత ఐదు సంవత్సరాలుగా నిబంధనల ప్రకారం ఇవ్వవలసిన యూనిఫాం, కొబ్బరినూనె, సబ్బులు ఇవ్వడం లేదు. దీనికి తోడు వార్డుల్లో కార్మికులు వ్యర్థాలను తరలించడానికి ఉపయోగించే పుష్‌కాట్ల కొరత కూడా ఉంది. కార్మికులకు జీతాలు కూడా సక్రమంగా ఇవ్వడం లేదు.



శివారు కాలనీలలో ట్యాంకర్లతో నీటి సరఫరా..



మంచినీటి చెరువు వద్ద ఏర్పాటుచేసిన మోటార్లు



మోటార్లతో చెరువులోకి నీటిని తోడిపోస్తున్న చిత్రం



పెదనందిపాడు రోడ్డులోని ప్రధాన మురుగుకాల్వలో పేరుకున్న వ్యర్థాలు



జాతీయ రహదారి పక్కన కాలువ పూడికతో నిండి పోవడంతో చిన్న వర్షానికే రోడ్డుపై నిలిచిన మురుగునీరు(ఫైల్ ఫోటో)



ఆక్రమణలు, వాహనాల పార్కింగ్‌తో బక్కచిక్కిన రోడ్లు

పల్నాడు వార్తలు

బీసీ భవన్ ఏర్పాటుచేస్తాం: జీవీ ఆంజనేయులు

వినుకొండటౌన్, ఏప్రిల్ 28: టీడీపీ అధికారంలోకి రాగానే రెండు నుంచి మూడు కోట్ల రూపాయలతో బీసీ భవన్ ఏర్పాటు చేస్తామని కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులు హామీ ఇచ్చారు. పట్టణంలోని ఫంక్షన్ హాల్‌లో ఆదివారం జరిగిన వడియ రాజుల ఆత్మీయ సమావేశానికి జీవీ ఆంజనేయులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాగానే జగన్మోహన్‌రెడ్డి బీసీలకు రద్దుచేసిన 27 సంక్షేమ పథకాలు పునరుద్ధరిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ ఎమ్మెల్యే బొల్లా లాంటి అరాచకవాదిని ఇంటికి పంపిస్తేనే మనమంతా ప్రశాంతంగా స్వేచ్ఛగా ఉంటామన్నారు. పట్టణంలోని 17వ వార్డు మరియు 22వ వార్డు నుంచి వైసీపీకి చెందిన 60 కుటుంబాలు ఆదివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వీరికి హరీష్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అలాగే నూజండ్ల మండలంలోని ముక్కెళ్ళపాడు నుంచి 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి.

దేవాలయంలో లీలావతి పూజలు

వినుకొండ టౌన్, ఏప్రిల్ 28: కారంపూడిరోడ్డులోని నరగాయపాలెం సమీపంలోని నీలంపాటి అమ్మవారి తిరునాళ్ళ మహోత్సవాన్ని పురస్కరించుకొని మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సతీమణి, శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఛైర్మన్ గోనుగుంట్ల లీలావతి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

లింగంగుంట్లలో లావు, చదలవాడకు ఘన స్వాగతం


చర్చిలో ప్రార్థనలు నిర్వహిస్తున్న లావు, చదలవాడ తదితరులు

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 28: వైసీపీ కంచుకోట నరసరావుపేట మండలం లింగంగుంట్లలో నరసరావుపేట టీడీపీ కూటమి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు, లావు శ్రీ కృష్ణ దేవరాయలకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దశాబ్దాలుగా తెలుగుదేశం కనీసం ప్రచారం కూడా చేయని ప్రాంతంలో వేలాది మందితో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నరసరావుపేట నియోజకవర్గం లింగంగుంట్ల గ్రామంలో వేలాదిగా తరలి వచ్చిన కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన ఇంచార్జ్ సయ్యద్ జిలాని, బీజేపీ నాయకులు రంగిశెట్టి రామకృష్ణ, టీడీపీ నాయకులు కపిలవాయి విజయకుమార్,గోనుగుంట్ల కోటేశ్వరరావు, వేల్పుల సింహాద్రి యాదవ్, చిన్నపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేట 30వ వార్డు వైసీపీ నాయకుడు టీడీపీలో చేరిక

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 28 : నరసరావుపేట పట్టణంలోని 30వ వార్డుకు చెందిన షేక్ భాషా ఆదివారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు తన కార్యాలయంలో భాషకు కండువా కప్పి సాదరంగా టీడీపీలోకి ఆహ్వానిచ్చారు. భాషా మాట్లాడుతూ విలువలేని చోట నిలబడలేక ఈరోజు టీడీపీలో చేరానన్నారు. కార్యక్రమంలో బులియన్ మర్చంట్ రాష్ట్ర అధ్యక్షుడు కపిలవాయి విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియా పోస్టులపై ఎమ్మెల్సీ మర్రి ఫిర్యాదు

చిలకలూరిపేట, ఏప్రిల్ 28: సామాజిక మాధ్యమాల్లో మర్రి రాజశేఖర్ ఫాలోయర్స్ పేరుతో అసభ్యకరమైన పోస్టులను షేర్ చేస్తున్న వారిపై ఆదివారం శాసన మండలి సభ్యుడు మర్రి రాజశేఖర్ చిలకలూరిపేట అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నెల రోజులుగా తన పేరుతో సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని ఫిర్యాదులో ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో గొడవలు సృష్టించే ఉద్దేశంతో ఈ విధమైన పోస్టులు పెడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ఇటువంటి పోస్టులు పెడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ విధంగా పోస్టులు పెట్టిన వారి అకౌంట్లను సామాజిక మాధ్యమాల నుంచి తొలగించాలని ఆయన కోరారు. ఈ మేరకు ఆయన చిలకలూరిపేట అర్బన్ సీఐకి ఆదివారం ఫిర్యాదు చేశారు.

వైభవంగా అంకమ్మ తల్లి తిరునాళ్ళ

రొంపిచర్ల, ఏప్రిల్ 28 : మండలంలోని బుచ్చిపాపన్నపాలెం గ్రామంలోని అంకమ్మ తల్లి తిరునాళ్ళ మహోత్సవం ఆదివారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారికి మహిళలు పొంగళ్లు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అమ్మవారికి విశేష అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో భజన కార్యక్రమాలు జరిగాయి.

క్రమబద్ధమైన జీవన విధానంతో షుగర్, బీపీలు అదుపు

● డాక్టర్ గోపాళం శివన్నారాయణ


శిబిరంలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్ గోపాళం శివన్నారాయణ

యడ్లపాడు, ఏప్రిల్ 28: సరైన ఆహారం, క్రమబద్ధమైన జీవన విధానంతో బీపీ, షుగర్‌లను అదుపులో ఉంచుకోవచ్చని విజయవాడకు చెందిన వైద్యుడు గోపాళం శివన్నారాయణ అన్నారు. యడ్లపాడు గ్రామాభ్యుదయ కమిటీ, లింగారావుపాలెం విజన్ ఫౌండేషన్‌ల ఆధ్వర్యంలో ఉచిత బీపీ, షుగర్ వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. స్థానిక పీఆర్ విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ఈ శిబిరానికి హాజరైన 220మందిని వైద్యులు పరీక్షించి మందులను పంపిణీ చేశారు. అనంతరం వైద్య శిబిరం సజావుగా సాగేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సేవలు అందిస్తున్న వైద్యులకు, పలువురు వలంటీర్లకు డాక్టర్ శివన్నారాయణ ప్రశంసా పత్రాలను నిర్వాహకులు అందజేశారు. గుంటూరుకు చెందిన వైద్యులు డాక్టర్ మోహన్‌భాస్కర్, డాక్టర్ గుంటుపల్లి భవ్యతేజ, డాక్టర్ రాజశ్రీలు శిబిరంలో పాల్గొని వైద్య సేవలు అందించారు.

మహంకాళి ఆలయ పునఃనిర్మాణం కోసం రూ.2.5 లక్షల విరాళం

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 28: మండలంలోని ఇసప్పాలెంలోని మహంకాళి అమ్మవారి ఆలయ పునఃనిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆలయ పునఃనిర్మాణం కొరకు ఇరుకుపాలెంకు చెందిన వేంపాటి శ్రీనివాసరావు, రమాదేవి దంపతులు రూ.2,50,116/-లక్షల విలువగల చెక్కును రాతి స్థంభం ఏర్పాటు కోసం ఆలయ కార్యనిర్వహణ అధికారి టి.సుధాకరరెడ్డికి అందజేశారు.

అక్రమ మద్యం స్వాధీనం

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 28: పట్టణ శివారు వినుకొండ రోడ్డులోని ఆంజనేయ స్వామి గుడి వద్ద ఆదివారం 12 సీసాల అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్టు నరసరావుపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ బీ నయనతార తెలిపారు. నిందితుడు కొండలరావుపేటకు చెందిన షేక్ మహబూబ్ సుభానీని అదుపులోకి తీసుకున్నామని, అతని వద్ద నుంచి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని ఆమె తెలిపారు.

వ్యక్తిపై దాడి

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 28: ఓ శుభకార్యంలో స్వల్ప వివాదం నేపథ్యంలో పట్టణంలోని రంగావారి వీధికి చెందిన రావూరి సాయిరామ్‌పై ఐదుగురు వ్యక్తులు దాడి చేసినట్టు రెండో పట్టణ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. సాయిరామ్ పెదచెరువులోని బంధువుల ఇంట్లో బారసాలకు వెళ్ళాడు. ఈ నేపథ్యంలో చోటు చేసుకున్న స్వల్ప వివాదంతో అదే ప్రాంతానికి చెందిన తల్లికుంట పార్వతి, వెంకటరావు, గుంజి శ్రీను, అంజమ్మ, వెంకటేష్‌లు తనపై దాడి చేసినట్టు సాయిరామ్ ఫిర్యాదులో పేర్కొన్నాడు. కేసును ఈమేరకు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

టీడీపీ హయాంలోనే వినుకొండ అభివృద్ధి

ప్రచారంలో కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులు


14 వార్డులో ప్రచారంలో పాల్గొన్న జీవీ ఆంజనేయులు

వినుకొండ, ఏప్రిల్ 28: తెలుగుదేశం పార్టీ హయాంలోనే వినుకొండ అభివృద్ధి జరిగిందని జీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని 14వ వార్డులో ఆదివారం జీవీ ఆంజనేయులు, శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఛైర్మన్ జీవీ సతీమణి లీలావతి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరు గుతూ టీడీపీ ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ 2014 నుంచి 19 వరకు రూ.2600 కోట్లు నిధులు తీసుకొచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశామని, ఆ తరువాత వచ్చిన ఎమ్మెల్యే బొల్లా ఒక్క రూపాయి నిధులు కూడా తీసుకురాలేదని విమర్శించారు. టీడీపీ హయాంలో వేసిన సీసీ రోడ్లకు డ్రెయినేజీలు కూడా కట్టలేని దుర్మార్గపు ప్రభుత్వం వైసీపీదని అన్నారు. బొల్లా జగన్ వద్ద ఊడిగం చేస్తూ ప్రజల బాగోగులు గాలికి వదిలేశారని విమర్శించారు. వైసీపీ ఎంపీ అభ్యర్థిగా నిలబడ్డ అనిల్‌కుమార్‌యాదవ్ నీటి పారుదల శాఖ మంత్రిగా ఉండి కూడా పల్నాడు ప్రాంతాన్ని, రాష్ట్రాన్ని పట్టించుకోలేదని, అలాంటి వ్యక్తికి ఓట్లు వేస్తే బెట్టింగ్‌లకు అడ్డాగా మారుస్తారే తప్ప పల్నాడు ప్రాంతం అభివృద్ధి చెందదన్నారు. వినుకొండ, పల్నాడు జిల్లా అభివృద్ధి చెందాలంటే తనను, ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలును గెలిపించాలని కోరారు.

టీడీపీలో చేరికలు

పలుకూరు పంచాయతీ ఎర్రవేణి చెంచుకాలనీ వైసీపీకి చెందిన 40 కుటుంబాలు ఆదివారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో పార్టీలో చేరిన వారికి కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులు పార్టీ కండువాకప్పి ఆహ్వానించారు. అలాగే దోమలగుండం గ్రామానికి చెందిన ఐదు కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

మే 1న ఇంటి వద్దనే పింఛన్లు పంపిణీ చేయాలి..

రాష్ట్ర వ్యాప్తంగా మే 1వ తేదీన పింఛన్లను లబ్ధిదారుల ఇంటి వద్దనే పంపిణీ చేయాలని కోరుతూ ఉమ్మడి కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులు ఆదివారం టీడీపీ, జనసేన నాయకులు కొంజేటి నాగశ్రీనురాయల్, బీజేపీ నాయకులతో కలిసి 14వ వార్డులో ప్లకార్డులు పట్టుకొని నిరసన ర్యాలీ నిర్వహించారు. టీడీపీ ప్రభుత్వం రాగానే రూ.4వేలకు పింఛన్ పెంచి ఇంటి వద్దనే పంపిణీ చేస్తారని అన్నారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడుతూ గత నెలలో 32మంది అభాగ్యుల ప్రాణం తీశారన్నారు. రాజకీయ కోణంలో కాకుండా మానవత్వంగా ఈ ప్రభుత్వం ఆలోచించి వృద్ధులకు, దివ్యాంగులను వేధించకుండా ఇంటి వద్దనే పింఛన్లు పంపిణీ చేయాలని కోరారు. పింఛన్ల పంపిణీకి గ్రామ, వార్డు సచివాలయాలు, పంచాయతీ, రెవెన్యూ కావాల్సినంత సిబ్బంది ఉన్నారని, ఇళ్ల వద్దకే పింఛన్లు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

● మండలంలోని మదమంచిపాడు తిరునాళ్ల సందర్భంగా ఆదివారం ఉమ్మడి కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులు మదమంచిపాటి ఆంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవాలయ కమిటీ జీవీ ఆంజనేయులును సన్మానించారు.

చంద్రబాబుతోనే యువతకు ఉపాధి: హరీష్


వేల్పూరులో ఎన్నికల ప్రచారం చేస్తున్న హరీష్‌బాబు

వేల్పూరు (శావల్యాపురం), ఏప్రిల్ 28: రాష్ట్రంలో నిరుద్యోగాన్ని పారద్రోలి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించగలిగే సత్తా ఉన్న నాయకుడు ఒక్క చంద్రబాబు మాత్రమేనని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులు తనయుడు గోనుగుంట్ల హరీష్ అన్నారు. మండలంలోని వేల్పూరులో ఆదివారం ఇంటింటికీ తిరిగి చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించి కరపత్రాలు అందజేశారు. జడ్పీటీసీ పారా హైమావతి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్నివర్గాలకు మంచి జరగనుందన్నారు. అనంతరం గంటవారిపాలెంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద జరుగుతున్న తిరునాళ్ళల్లో హరీష్‌బాబు పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ నాయకులు గడిపూడి విశ్వనాథం, యరమాసు కోటేశ్వరరావు, గోరింట్ల హనుమంతరావు, బొల్లా పేరయ్య, దొడ్డా ఏడుకొండలు, సాదినేని కృష్ణమూర్తి, యేగినాటి తిరుపతిరావు, లింగా శ్రీనివాసరావు, బోయపాటి మహేష్, ఎస్.శివప్రసాద్, పూరేటి శ్రీకాంత్, పావులూరి శ్రీను, బీజేపీ నేత జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బొల్లాపల్లి మండలంలో టీడీపీలోకి..

బొల్లాపల్లి, ఏప్రిల్ 28: మండలంలోని ఎర్రవేణి చెంచుకాలనీ, వెల్లటూరు, దోమలగుండం, రెడ్డిపాలెం గ్రామాల నుంచి వైసీపీని వీడి టీడీపీలో చేరారు. రెడ్డిపాలెం నుంచి పది కుటుంబాలు, ఎర్రవేణి చెంచు కాలనీ నుంచి 40కుటుంబాలు, దోమల గుండం నుంచి ఐదు కుటుంబాలు, వెల్లటూరు నుంచి పలు కుటుంబాలు ఆదివారం కూటమి అభ్యర్థి జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, జనసేన నాయకులు రాయలు, నాగోతు శ్రీనుల ఆధ్వర్యంలో వైసీపీ నుంచి టీడీపీలోకి భారీ చేరికలు జరిగాయి. కార్యక్రమంలో గోవిందునాయక్, బాపయ్య, పి. వెంకటనారాయణ, హనుమానాయక్, పలువురు టీడీపీ నాయకులున్నారు.


1వ తారీకు ఇళ్ల వద్దే పెన్షన్లు పంపిణీ చేయాలంటూ ప్లకార్డులతో నిరసన తెలియజేస్తున్న జీవీ ఆంజనేయులు

వైద్యరంగాన్ని భ్రష్టుపట్టించిన జగన్‌రెడ్డి

● దైవంగా భావించే డాక్టర్లను వేధించాడు ● కూటమి అభ్యర్థి డాక్టర్ అరవిందబాబు


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు తదితరులు

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 28: వైద్య రంగాన్ని జగన్‌రెడ్డి భ్రష్టు పట్టించాడని, దైవంగా భావించే డాక్టర్లను వేధించిన నీచుడు జగన్‌రెడ్డి అని ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. ఆదివారం నరసరావుపేట పట్టణంలో మెడికల్ కాంప్లెక్స్‌లో మెడికల్ అసోసియేషన్ సభ్యులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ మాస్కు అడిగిన పాపానికి డాక్టర్ సుధాకర్‌ను వేధించి చంపేశారని అన్నారు. అదేవిధంగా డాక్టర్ అచ్చెన్న, అనితారాణిలపై వైసీపీ ముఠా ఏ విధంగా వ్యవహరించిందో అందరం చూశాం అన్నారు. ప్రజలకు వైద్యం అందకుండా చేసి, మెడికల్ వ్యవస్థ మొత్తాన్ని జగన్‌రెడ్డి నాశనం చేశాడని అన్నారు. డబ్బులు చెల్లించకుండా నెట్‌వర్క్ ఆస్పత్రుల్ని హింసిస్తున్నాడని, అంబులెన్స్‌ల పేరిట కూడా దోపిడీకి పాల్పడుతున్న దుర్మార్గుడిని రాష్ట్రం నుంచి తరిమికొట్టాన్నారు. కార్యక్రమంలో సయ్యద్ జిలానీ, బీజేపీ నాయకుడు రంగిశెట్టి రామకృష్ణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వేల్పుల సింహాద్రియాదవ్, కపిలవాయి విజయకుమార్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనంతా అన్యాయాలు, అక్రమాలే: అరవిందబాబు

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 28: వైసీపీ ఐదేళ్ళ పాలనంతా అన్యాయాలు, అక్రమాలు, అవినీతే తప్ప అభివృద్ధి లేదని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. ఆదివారం టీడీపీ కార్యాలయంలో ఎన్డీఏ చార్జిషీట్ అరాచకపాలన అంతం, కూటమి పంతం జగనాసుర రక్తచరిత్రను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ చార్జిషీట్‌లో పొందుపరిచిన ప్రతి అంశాన్ని ప్రజల వద్దకు తీసుకువెళ్ళి ఎన్నికలలో వైసీపీని చిత్తుచిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వేల్పుల సింహాద్రియాదవ్, కపిలవాయి విజయ్‌కుమార్, బండారుపల్లి విశ్వేశ్వరరావు, పి.జగ్గయ్య, కొల్లి వెంకటేశ్వర్లు, జి.సురేష్, కామినేని అమర్నాద్, చిన్నపరెడ్డి, మడక శివప్రసాద్, దావల నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ చదలవాడ అరవిందబాబు, డాక్టర్ చదలవాడ అమూల్య, కపలవాయ విజయకుమార్ తదితరులు

వైసీపీ రాక్షస ప్రభుత్వాన్ని గద్దెదించాలి: డాక్టర్ అమూల్య

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 28: వైసీపీ రాక్షస ప్రభుత్వాన్ని గద్దెదించాలని, అందరం కలిసికట్టుగా పోరాడాలని డాక్టర్ చదలవాడ అమూల్య పిలుపునిచ్చారు. ఆదివారం నరసరావుపేట పట్టణంలో రామిరెడ్డిపేటలో వైసీపీ నుంచి టీడీపీలోకి వందమంది చేరారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, ఆయన తనయ డాక్టర్ చదలవాడ అమూల్య కండువాలు కప్పి సాదరంగా టీడీపీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా డాక్టర్ అమూల్య తన తండ్రి ఐదేళ్లుగా ప్రజల కోసం పడిన కష్టాన్ని గుర్తుచేసుకొని భావోద్వేగంతో కన్నీటిపర్యంతం అయ్యారు. మున్సిపాలిటీకి వచ్చే నిధులు ఎటు పోతున్నాయన్నారు. వేలవేల కోట్లు ఎవరి జేబులలోకి వెళుతున్నాయో ఆలోచించాలన్నారు. డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిన వారిని ఇబ్బందిపెట్టేందుకు ప్రయత్నంచేస్తే సరైన రీతిలో బుద్ధి చెబుతామన్నారు. షాహిదా, వాళ్ళ కుటుంబ సభ్యులు వంద మంది కార్యకర్తలు టీడీపీలో చేరారన్నారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వేల్పుల సింహాద్రియాదవ్, కపిలవాయి విజయకుమార్, వాసిరెడ్డి రవీంద్ర, మైనారిటీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ మాబు, దాసరి ఉదయశ్రీ, టీడీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సాధికారత తెలుగుదేశం పార్టీతోనే సాధ్యం: చదలవాడ

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 28: టీడీపీతోనే బ్రాహ్మణ సాధికారత సాధ్యం అవుతుందని కూటమి నరసరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. నరసరావుపేట పట్టణంలోని విజయ్‌కుమార్ కల్యాణ మండపంలో బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి గూడూరు శేఖర్ అధ్యక్షతన నిర్వహించిన బ్రాహ్మణుల ఆత్మీయ సమావేశంలో అయన మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం హయాంలో బ్రాహ్మణుల కోసం ఎన్నో పథకాలు అమలు చేస్తే జగన్ రెడ్డి వచ్చాక మొత్తం పథకాలు రద్దు చేశాడని ఆరోపించారు. దేవాలయల ఆస్తుల్ని కబ్జా చేశారు. దేవాలయాల పరిధిలో ఉండే వేలాది ఎకరాలను కబ్జా చేయడమే లక్ష్యంగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకొస్తున్నాడని విమర్శించారు. బ్రాహ్మణ జాతిపై అవమానకరంగా వ్యవహరించిన జగన్ రెడ్డిని, గోపిరెడ్డిని డిపాజిట్లు కూడా దక్కకుండా ఓడించాలని డాక్టర్ అరవిందబాబు పిలుపునిచ్చారు. బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ బుచ్చి రాంప్రసాద్ మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వస్తే బ్రాహ్మణులకు కోసం అమలు చేసే పథకాలను వివరించారు.

కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి, రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ గొనుగుంట్ల కోటేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఎ.వి.రమణ, బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర కో ఆర్డినేటర్ టి.వి.శ్రీరామమూర్తి, బ్రాహ్మణ సాధికార సమితి రాష్ట్ర అధికార ప్రతినిధి ఈమని సూర్య నారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కె.కుసుమ కుమారి, స్థానిక బ్రాహ్మణ నాయకులు మహేశ్వర భట్ల శ్రీనివాసశర్మ, పాలపర్తి సుధీర్, కోట కృష్ణ, వీవీఎస్ కె అయ్యం, నారాయణం సత్యనారాయణ ప్రసాద్, సతీష్ శర్మ, జేకేసీ నాగరాజు శర్మ, గుడిపల్లి కృష్ణ మోహన్, అరిపిరాల ఫణిశర్మ, సాగి శివ కృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వేసవి శిక్షణ తరగతులు

వినుకొండటౌన్, ఏప్రిల్ 28: పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థులకు పీఏఆర్‌డి ఆధ్వర్యంలో డాక్టర్ లక్ష్మయ్య స్టడీ సర్కిల్ వారు ఉచిత వేసవి శిక్షణ తరగతులు ఏర్పాటుచేస్తున్నట్లు ఆదివారం పారా లక్ష్మయ్య ప్రకటనలో తెలిపారు. పట్టణ సమీపంలో ఉన్న భ్రమర టౌన్‌షిప్‌లో మే 3వ తేదీ నుంచి క్లాస్‌లు ప్రారంభిస్తున్నట్లు లక్ష్మయ్య తెలియజేశారు. ఆసక్తికలిగిన విద్యార్థులు 8500218036 నెంబర్‌కు ఫోన్‌చేసి పేర్లు నమోదుచేసుకోవాలని, రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులకు మాత్రమే శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు.

మరోసారి మోసపోవటానికి ప్రజలు సిద్ధంగా లేరు

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 28: ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి చేతుల్లో మరోసారి మోసపోవటాని ప్రజలు ఎవ్వరూ సిద్ధంగా లేరని మాజీ మంత్రి, చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. పట్టణంలోని 12వ వార్డులో ప్రత్తిపాటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు శంఖారావం, సూపర్-6 పథకాలను ఇంటింటికి తిరిగి ప్రచారం చేసి కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం ప్రస్తుత ఎన్నికలకు జగన్ విడుదల చేసిన మేనిఫెస్టోపై మాట్లాడుతూ పోలవరం పూర్తిచేయని వాడు, వారంలో సీపీఎస్ రద్దు చేయనివాడు, జలయజ్ఞ ప్రాజెక్టుల మొత్తాన్ని పాడుపెట్టిన అసమర్థుడు, అన్నీ చేశామని ఎలా చెప్పుకుంటారన్నారు. ఈ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా శ్రీకృష్ణదేవరాయలును సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని ప్రత్తిపాటి పిలుపు నిచ్చారు.

మే 1వ తేదీనే ఇంటింటికీ పింఛన్లు పంపిణీ చేయాలి: ప్రత్తిపాటి


సమావేశంలో మాట్లాడుతున్న కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 28: రాష్ట్ర వ్యాప్తంగా ఎట్టి పరిస్థితుల్లోను మే 1వ తేదీనే ఇంటి వద్దకే పింఛన్‌లను పంపిణీ చేయాలని మాజీ మంత్రి, చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు డిమాండ్ చేశారు. పట్టణంలోని శనివారం 37వ వార్డులో కుటుంబ సాధికార సారధులు తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకుల కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఎన్నికల వ్యూహం, ప్రచారం పై దిశ, నిర్దేశం చేశారు. అనంతరం మాట్లాడిన ప్రత్తిపాటి ఇంటి వద్దకే పింఛన్‌లు పంపిణీ చేయటానికి గ్రామ వార్డు సచివాలయాలు, పంచాయతీ రెవెన్యూలో కావాల్సినంత మంది సిబ్బంది ఉన్నారన్నారు. గత నెలలో కూడా వెసులు బాటు ఉన్నప్పటికీ శాశ్విత ప్రభుత్వ ఉద్యోగులను పింఛన్‌ల పంపిణీకి ఉపయోగించు కోవచ్చని ఈసీ చెప్పిన కావాలనే రాజకీయ స్వార్థం కోసం జగన్ 32 మంది ప్రాణాలు తీశారని ప్రత్తిపాటి ఆగ్రహం వ్యక్తం చేశారు. పైగా ఆ నిందలు విపక్షాల పై వేసి ఎన్నికల్లో లబ్ధి పొందాలని కుట్రలు చేశారన్నారు.

నిరుద్యోగులకు తీరని ద్రోహం చేసిన జగన్‌రెడ్డి: శరత్

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 28: రాష్ట్రంలోని యువత, నిరుద్యోగులకు ముఖ్యమంత్రి జగన్ తీరని ద్రోహం చేశారని కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు తనయుడు శరత్ అన్నారు. మండలంలోని గోపాళంవారిపాలెంలో పుల్లారావుకు మద్దతుగా శరత్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి తెలుగుదేశం సూపర్-6 పథకాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. శరత్‌కు మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు.

జగన్ మాటలు నమ్మితే నష్టపోవటం ఖాయం

● వెంకటకుమారి


ఎన్నికల ప్రచారం చేస్తున్న ప్రత్తిపాటి వెంకట కుమారి

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 28: ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి మాటలు నమ్మితే ప్రజలు మరోసారి నష్టపోవటం ఖాయమని మాజీమంత్రి, చిలకలూరిపేట కూటమి అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు సతీమణి వెంకట కుమారి అన్నారు. పట్టణంలోని 14వ వార్డు రహమత్ నగర్‌లో పుల్లారావు విజయాన్ని కాంక్షిస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

టీడీపీతోనే అభివృద్ధి, సంక్షేమం

యడ్లపాడు, ఏప్రిల్ 28 : టీడీపీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని పలువురు తెలుగుదేశంపార్టీ నాయకులు పేర్కొన్నారు. మండల కేంద్రమైన యడ్లపాడులోని కొత్తూరు, ముస్లిం కాలనీ, ఎర్రచెరువు మెయిన్ బజారు, పాతూరు ముస్లిం బజారు, రజక, బోయ, ఎరుకల, సుగాలీ కాలనీలలో ఇంటింటి ప్రచారం ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కార్యదర్శి కాకుమాను చంటి, గ్రామ పార్టీ అధ్యక్షుడు పోపూరి రామారావు, టీడీపీ నాయకులు పోపూరి రత్తయ్య, నాగేశ్వరరావు, లావు శ్రీకృష్ణదేవరాయల ప్రతినిధులు పాల్గొన్నారు.

వైసీపీ నేతల బాణసంచాతో అగ్ని ప్రమాదం

నూజెండ్ల, ఏప్రిల్ 28: మండలంలోని కంభంపాడులో వైసీపీ నేతల అనీల్ కుమార్, బొల్లా బ్రహ్మనాయుడు గ్రామానికి వచ్చిన సందర్భంలో వైసీపీ కార్యకర్తలు కాల్చిన బాణ సంచాతో అగ్ని ప్రమాదం జరిగింది. ఆదివారం పంచాయతీ కార్యాలయానికి ఎదురుగా ఉన్న పశుగ్రాసం, జామాయిల్ తోటలు వంద ఎకరాలకు బాణసంచాతో అగ్నిజ్వాలలు వ్యాపించాయి. మధ్యాహ్న సమయంలో అగ్ని ప్రమాదం చోటు చేసుకోవటంతో అగ్నిమాపక సిబ్బందికి మంటలను అదుపుచేయటం కష్టంగా మారింది.

ఉప్పరపాలెంలో పోలీసుల కార్డన్ సెర్చ్

ఉప్పరపాలెం (యడ్లపాడు), ఏప్రిల్ 28: పల్నాడు జిల్లా యడ్లపాడు మండలంలోని ఉప్పరపాలెంలో పోలీసులు ఆదివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి వాహనాలను తనిఖీ చేశారు. అక్రమ మద్యం నిల్వలకోసం పరిసరాల్లో గాలించారు. ఈ సందర్భంగా చిలకలూరిపేట రూరల్ సీఐ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ప్రజలు సహకరించాలన్నారు. గొడవలకు తావిచ్చేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సరైన ధృవపత్రాలులేని 11ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. తనిఖీలలో బీఎస్ఎఫ్ డీఎస్పీ, ఎస్ఐ, యడ్లపాడు ఎస్ఐ శ్యామ్యూల్ రాజీవ్‌కుమార్, 42మంది బీఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఆర్ కాలనీలో వాటర్ ప్లాంట్ ప్రారంభం

చిలకలూరిపేట, ఏప్రిల్ 28: పట్టణంలోని సీఆర్ కాలనీ పార్కులో వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు పార్కును సమగ్రంగా అభివృద్ధి చేయటానికి పూనుకోవటం అభినందనీయమని వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు వీ మురళీ మోహన రావు ఆదివారం అన్నారు. వాకర్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ పీ శ్రీనివాసులరెడ్డి, జోనల్ కమిటీ ఛైర్మన్ ఏ రాధికతో కలసి ఆయన సేవామృతం పేరుతో నెలకొల్పిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను, ఆఫీసు రూమ్ భవనాన్ని పార్కులో ప్రారంభించారు. ఈ సందర్భంగా మురళీ మోహనరావు, శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ రూ.2లక్షలతో వాటర్‌ప్లాంట్, రూ.60వేలతో ఆఫీసు భవనం, రూ.7లక్షలతో వాకింగ్ ట్రాక్, లక్ష రూపాయలతో ఫర్నీచర్, సౌండ్ సిస్టమ్ తదితర సౌకర్యాలను కల్పించారన్నారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పెరవలి రాఘవరావు, లంకా ఆదినారాయణరెడ్డి తదితరులు మాట్లాడుతూ దాతల సహకారంతో పార్కును మరింతగా అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. పార్కు అభివృద్ధికి తోడ్పడ్డ దాతలను ఈ సందర్భంగా సత్కరించారు. కార్యక్రమంలో పలువురు పట్టణ ప్రముఖులతో పాటు లంకా రఘురామిరెడ్డి, డాక్టర్ కొమ్మినేని వీరశంకరరావు, డాక్టర్ కొల్లా రామారావు, డాక్టర్ కొల్లా సతీష్ కుమార్, ఆదిరెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపత్తి ఆంజనేయస్వామి దేవస్థానం వార్షికోత్సవం

యడ్లపాడు, ఏప్రిల్ 28: యడ్లపాడు గ్రంథాలయం సెంటర్‌లోని శ్రీప్రపత్తి ఆంజనేయస్వామి దేవస్థానం 8వ వార్షికోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్వామివారికి తెల్లవారు జాము నుంచే స్వామివారికి విశేషపూజలు నిర్వహించారు. పంచామృతాలతో అభిషేకం, సహస్రనామార్చన, నవగ్రహ, పంచసూక్త, సుదర్శనహోమాలను నిర్వహించారు. పూర్ణాహుతి కార్యక్రమం అనంతరం స్వామివారిని పూలు, నాగవల్లీ దళాలతో విశేషంగా అలంకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని వేదికపై సీతారాముల శాంతికల్యాణం కన్నులపండువగా నిర్వహించారు. కార్యక్రమాలను ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఎం.రమణారావు, కార్యవర్గ సభ్యులు సి. నాగమల్లేశ్వరరావు, కె.సీత, ఎం.శ్రీను, దేసు సురేష్, ఆర్యవైశ్య సంఘం యువకులు పర్యవేక్షించారు.

విశ్రాంత డిప్యూటీ తహసీల్దార్ మృతి

వినుకొండటౌన్, ఏప్రిల్ 28: విశ్రాంత డిప్యూటీ తహసీల్దార్ అడ్డగట్ల శౌరిరాజు (64) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం మృతిచెందాడు. వినుకొండ నియోజకవర్గంలో వివిధ మండలాల్లో ఆర్ఐగా డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేశారు. రైల్వే స్టేషన్‌రోడ్డులోని స్వగృహంలో ఆయన మృతదేహాన్ని పలువురు సందర్శించి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు.